# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 169 | విశాఖపట్నం | 21-3-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 169 | VISAKHAPATNAM | 21-3-2026 SATURDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram






4

మనస్సున్న దాతలు ఆదుకోవాలి



2లో

కువైట్‌లోని కీలక రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి



6లో


ఉదయాన్నే కీళ్లు పట్టేసినట్లు అనిపిస్తుందా? - 'యూరిక్ యాసిడ్' సమస్య కావొచ్చు!!

## అకాల వర్షాలతో పంట దెబ్బతిన్న రైతన్నలను

# ఆదుకుంటాం: చంద్రబాబు

**అమరావతి, పతాకం న్యూస్:** అకాల వర్షాలతో పంట దెబ్బతిన్న రైతన్నలను ఆదుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రైతన్నలు అధైర్యపడొద్దని.. అండగా ఉంటామని భరోసా కల్పించారు. అకాల వర్షాలతో పంట నష్టంపై సీఎం తన క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. అకాల వర్షాలతో సంభవించిన పంట నష్టంపై వరుసగా రెండో రోజూ సీఎం సమీక్షించారు. భారీ గాలులు, అకాల వర్షాలు, వడగళ్లతో దెబ్బతిన్న పంటల వివరాలను తెలుసుకున్నారు. 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు వివరించారు. వీటి విలువ రూ.40 కోట్లుగా అధికారులు తేల్చారు. 9 జిల్లాల్లో 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మిరప, కూరగాయలు, మామిడి, ఆరెంజ్, నిమ్మ పంటలు దెబ్బతినట్లు అధికారులు వెల్లడించారు. ఉద్యాన పంటల నష్టం విలువ రూ.22.68 కోట్లుగా అంచనా వేశారు. అలాగే, ఎల్పీజీ సరఫరాపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో గ్యాస్ సిలిండర్ల సమస్య తలెత్తకుండా వ్యవస్థను తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్జీ, ఈవీ వంటి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇరాన్ – ఇజ్రాయిల్ యుద్ధంతో గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినక ముందే అప్రమత్తం కావాలని సూచించారు. ఫెర్టిలైజర్లు, పెట్రోల్, డీజిల్ లోటు రాకుండా కేంద్రంతో సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆలయాలకు ఎల్పీజీ సరఫరాలో ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

సీఎం చంద్రబాబుకు సబ్కా ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. ఉగాది కానుకగా తాము సైతం ఊహించని విధంగా సూక్ష్మ, చిన్న మధ్యతరగతి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు చేశారని హర్షం వ్యక్తం చేశారు. సుదీర్ఘంగా ఎదురు చూస్తున్న 2021



సంవత్సరానికి చెందిన 15వ ఆర్థిక, జనరల్ నిధులను వివిధ మున్సిపాలిటీలలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేయడాన్ని సబ్కా మనస్ఫూర్తిగా స్వాగతిస్తోందని అన్నారు. అలాగే రోడ్ల పనులు చేసిన వారికి, ఐవీఖీ +త్ఘుత్ం, ౹ాఐవీఖీ +త్ఘుత్ం, వివిధ క్ఫ్వ +త్ఘుత్ం తాలూకా పనులు చేసిన వారికి బిల్లులు విడుదల చేశారని తెలిపారు. ప్రభుత్వానికి ఉన్న ఆర్థిక సవాళ్లలో సైతం ఉగాది పండుగ సందర్భంగా పేమెంట్స్ విడుదల చేసినందుకు ముఖ్యమంత్రికి, మంత్రులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా బిల్లులు రాని కాంట్రాక్టర్లకు సైతం ఈ ఆర్థిక సంవత్సరంలోనే నిధులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఉగాది కానుక ఇచ్చినందుకుగానూ థాంక్యూ సీఎం సార్ అంటూ సబ్కా ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.



# గోదావరి నదిలో మునిగి ఇద్దరు మృతి

## మరో ముగ్గురు గల్లంతు

**భద్రాచలం పతాకం న్యూస్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం సఅతీవ్ర విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన ఐదుగురు విద్యార్థులు నీటి ఉధృతికి కొట్టుకుపోయారు. ఈ ఘటన ఆయా కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమరావతిలో గల ఎస్ఆర్ఎం యూని వర్సిటీ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఏడుగురు విద్యార్థుల బృందం సెలవుల నేపథ్యంలో భద్రాచలం పర్యటనకు వచ్చారు. భద్రాచలం – కూనవరం రహ దారిలోని కొల్లుగూడెం ఇసుక ర్యాంపు ప్రాంతంలో గోదావరి నది అందాలను చూసేందుకు వారు వెళ్లారు. ఈ క్రమంలో ఈత కొట్టేందుకు నదిలోకి దిగారు. అయితే.. నీటి లోతును సరిగ్గా అంచనా వే యలేక పోవడం, ప్రవాహ వేగం అకస్మాత్తుగా పెరగడంతో విద్యార్థులు నీటిలో మునిగిపోయారు. గట్టుపై ఉన్న మిగిలిన ఇద్దరు విద్యార్థులు గట్టిగా కేకలు వేయడంతో చేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీశ్ – మదనపల్లి(చిత్తూరు జిల్లా), నవదీప్ – ఉయ్యూరు(కృష్ణా జిల్లా), తేజజ్ఞ – ఉయ్యూరు(కృష్ణా జిల్లా), అభిరామ్ – భద్రాచలం, శ్రీకర్ – భద్రాచలానికి చెందిన వారిగా గుర్తించారు. వీరిలో ఇద్దరు భద్రాచలానికి చెందిన వారు కాగా, మిగిలిన ముగ్గురు ఏపీలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు.

### వాహనాలపైకి దూసుకెళ్లిన బస్సు..

## ఎనిమిది మంది మృతి



**కోయంబత్తూరు:** తమిళనాడు రాష్ట్రం, సేలం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జాతీయ రహ దారిలో ఉత్తమసోలాపురం సమీపంలోని అరియనూర్ వద్ద తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టడంతో ఎనిమిది మంది మృతి చెందారు. కోయంబత్తూరు నుంచి సేలంకు ప్రయాణిస్తున్న ఈ బస్సులో 40 మంది ఉన్నారు. ఈ బస్సు అదుపు తప్పి అవతలి లైన్‌ను దాటుకుని మరో లైన్‌లోకి వచ్చి ఎదురుగా వెళుతున్న వాహనాలను ఢీకొట్టింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి.

### హిందూ ధర్మ రక్ష' అంటూ ప్రకటనలు హాస్యాస్పదం..

## జగన్‌పై పార్థసారథి ఫైర్



**అమరావతి, పతాకం న్యూస్:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం మీడి యాతో మాట్లాడుతూ.. 'హిందూ ధర్మాన్ని భక్షించే వారే 'హిందూ ధర్మ రక్ష' అని సాక్షి పత్రికలో ప్రకటనలు ఇవ్వడం హాస్యా స్పదం' అని వ్యాఖ్యానించారు. పండుగల సమయంలో ప్రజలందరికీ మేలు జరగాలని కోరుకోకుండా.. కేవలం జగన్ బాగుండాలని మాత్రమే కోరుకోవడమే వైసీపీ నైజమని ఆరోపించారు. గత ఐదేళ్లలో హిందూ సంప్రదాయాలను గౌరవించిన దాఖలాలు లేవని, కల్తీ నెయ్యితో లడ్డూ తయారీ ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీశారని మంత్రి ఆరోపించారు. జగన్ ఆలయాలకు వెళ్లకుండా ఇంట్లోనే సెట్టింగ్‌లు వేసి పూజలు చేస్తున్నట్లు నటించడం అలవాటుగా మారిందని మంత్రి విమర్శించారు. అబ్దుల్ కలాం వంటి మహానుభావులు సంప్రదాయాలను గౌరవించి డిక్లరేషన్ ఇచ్చారని.. కానీ జగన్ ఎప్పుడూ ఆ పని చేయలేదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, యువత ఉపాధి విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో గ్రాడ్యుయేట్ నిరుద్యోగం 24 శాతానికి చేరి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, పతాకం న్యూస్:** నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 25 మందికి రూ.12.74 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా సిఎం సహాయనిధి ద్వారా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోం దన్నారు. ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 1,36,240 మందికి రూ.1,241 కోట్ల ఆర్థిక సాయం అందజేశామని తెలిపారు. పేదల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ విషయంలో సిఎం సహాయనిధి కష్టకా లంలో ఆదుకునే ఆపన్నహస్తమన్నారు.


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY / తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY / తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### బాల్యం..

ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా మొదటగా నశించేది మానవత్వం, ఎక్కువగా నష్టపోయేది బాల్యం. బాంబులు పడుతున్నప్పుడు కూలిపోతున్నది కేవలం భవనాలు కాదు. వేలాది బాలల కలలు, భవిష్యత్తు కూడా. ఉక్రెయిన్, గాజా, ఇరాన్ వంటి ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు లక్షలాది పిల్లలను అనాథలుగా, శరణార్థులుగా మార్చుతున్నాయి. చదువు, ఆరోగ్యం, భద్రత వంటి ప్రాథమిక హక్కులు కూడా వారికి అందకుండా పోతున్నాయి. బాలలు యుద్ధాలకు కారణం కాకపోయినా, ప్రతి యుద్ధంలో అత్యధికంగా బాధపడుతున్నవారు వారే. అందుకే బాలల హక్కులను కాపాడటం అంటే యుద్ధాలను ఆపడం, శాంతిని కాపాడటం. ప్రపంచంలో ఎక్కువ యుద్ధాలు ప్రధానంగా నాలుగు అంశాల కోసం జరుగుతున్నాయి. మొదటిది రాజకీయ అధికారం. కొంతమంది నాయకులు 'విదేశీ శత్రువు' అనే బూచిని సృష్టించి జాతీయతను రెచ్చగొట్టి తమ అధికారాన్ని పటిష్టపరుచుకుంటారు. రెండవది ఆయుధ వ్యాపారం. ఆయుధ తయారీ సంస్థలు ప్రపంచంలో అత్యధిక లాభాలను పొందే రంగాల్లో ఒకటి. యుద్ధం మొదలైతే కోట్ల డాలర్ల వ్యాపారం జరుగుతుంది. మూడవది సహజ వనరులపై ఆధిపత్యం. చమురు, గ్యాస్, ఖనిజాలు, నీరు వంటి వనరుల కోసం యుద్ధాలు జరుగుతున్నాయి. నాలుగవది మతం లేదా జాతీయత. ఇవి చాలాసార్లు నిజమైన కారణాలు కాకుండా ప్రజలను యుద్ధానికి ప్రేరేపించే ఒక ముసుగుగా ఉపయోగపడతాయి. ఈ నాలుగు కారణాల్లో ఒక్కటి కూడా సాధారణ ప్రజల ప్రయోజనం కోసం కాదు. లాభం కొద్ది మందికి, నష్టం కోట్లాది మందికి. ఆధునిక యుద్ధాల్లో మరణించే వారిలో ఎక్కువ మంది సైనికులు కాదు, సాధారణ ప్రజలు. అందులో పెద్ద భాగం బాలలే. అంతర్జాతీయ సంస్థల నివేదికల ప్రకారం ఆధునిక యుద్ధాల్లో సుమారు 90 శాతం మరణాలు సాధారణ ప్రజలవే. బాలలను కోల్పోతే మనం మన భవిష్యత్తును కోల్పోతున్నాం. ఎవరి లాభంకోసమైనా బాలల రక్తాన్ని ఖర్చు చేయడం మానవత్వానికే మచ్చ. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నాలుగేళ్లుగా కొనసాగుతోంది. దీని ప్రభావం లక్షలాది కుటుంబాలపై పడింది. నివేదికల ప్రకారం 2022 నుంచి కనీసం 3200 మంది బాలలు చనిపోయారు లేదా గాయపడ్డారు. ఒక్క 2025లోనే 92 మంది బాలలు మరణించగా, 652 మంది గాయపడ్డారు. దేశంలోని మూడింట ఒక వంతు బాలలు మానసిక గాయాలకు గురయ్యారు. పాఠశాలలు ధ్వంసం కావడం, విద్యుత్ సౌకర్యాలపై దాడులు జరగడం వల్ల పిల్లలు చదువు, ఆరోగ్య సేవలు కోల్పోతున్నారు. చాలామంది శరణార్థులుగా మారిపోయారు. 2023 అక్టోబర్ నుంచి కొనసాగుతున్న గాజా యుద్ధం బాలలపై అత్యంత దారుణ ప్రభావం చూపింది. నివేదికల ప్రకారం 21 వేలకు పైగా బాలలు చనిపోయారు. 44 వేలకుపైగా బాలలు గాయపడ్డారు. వారిలో వేలాది మంది శాశ్వత వికలాంగులయ్యారు. 56 వేలకుపైగా బాలలు తమ తల్లిదండ్రులను కోల్పోయారు. పాఠశాలలు, ఆసుపత్రులు ధ్వంసమయ్యాయి. ఆహారం లేక వేలాది బాలలు ఆకలి చావు అంచున ఉన్నారు. ఈ యుద్ధం వేలాది బాలలను అనాథలుగా, భయంతో జీవించేలా చేసింది. ఫిబ్రవరి 2026 లో ప్రారంభమైన ఇరాన్ యుద్ధం కూడా బాలలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రారంభ దాడుల్లోనే 180 నుండి 200 మంది బాలలు మరణించినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఒక పాఠశాలపై జరిగిన దాడిలో 168 మంది బాలికలు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. పలు పాఠశాలలు, ఆసుపత్రులు ధ్వంసమయ్యాయి. విద్య, ఆరోగ్య సేవలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రపంచ సంఘర్షణల్లో బాలలపై ఆరు ప్రధాన ఉల్లంఘనలు జరుగుతున్నాయి. బాలలను చంపడం లేదా గాయపరచడం. బాలలను సైనికులుగా ఉపయోగించడం. పాఠశాలలు, ఆసుపత్రులపై దాడులు. లైంగిక హింస, బాలల అపహరణ. మానవతా సహాయాన్ని నిరాకరించడం. ఇవి అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకం అయినప్పటికీ యుద్ధాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచంలో కోట్లాది బాలలు యుద్ధ ప్రభావంలో జీవిస్తున్నారు. నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 47.3 కోట్ల బాలలు ఘర్షణాత్మక ప్రాంతాల్లో జీవిస్తున్నారు. ప్రతి రోజూ సగటున 23 మంది బాలలు బాంబు దాడుల్లో గాయపడుతున్నారు. లేదా చనిపోతున్నారు. పాఠశాలలపై దాడులు గణనీయంగా పెరిగాయి. లక్షలాది బాలలు స్కూల్‌కు వెళ్లలేకపోతున్నారు. కోట్లాది బాలలు శరణార్థులుగా మారిపోయారు. యుద్ధం వారి జీవితాలను శాశ్వతంగా మార్చేస్తోంది.

## విశాఖలో 'ట్రాఫిక్ సోల్జర్స్'..

## పోలీసులకు అండగా పౌర సైన్యం




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ లక్ష్యంగా పోలీసులు ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'ట్రాఫిక్ సోల్జర్స్' పేరుతో పౌర భాగస్వామ్యానికి పెద్దపీట వేస్తూ సరికొత్త విధానాన్ని అమలులోకి తెచ్చారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించి, ప్రజలలో రహదారి భద్రతపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా ఆసక్తి కలిగిన 206 మందిని ఎంపిక చేసి, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి విధుల్లోకి తీసుకున్నారు. ఈ నెల 16 నుంచి వీరు నగరంలోని 21 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సేవలు అందిస్తున్నారు. ఈ ట్రాఫిక్ సోల్జర్స్ ప్రధానంగా నగరంలోని రద్దీ కూడళ్లు, ఆసుపత్రులు, మార్కెట్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెడతారు. సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్‌లో డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, తప్పుడు ప్రదేశాల్లో పార్కింగ్ వంటి నిబంధనల ఉల్లంఘనలను గుర్తిస్తారు. అయితే, జరిమానాలు విధించకుండా, వాహనదారులకు సున్నితంగా నచ్చజెప్పి, నిబంధనలపై అవగాహన కల్పిస్తారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వారికి, డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్ వాడేవారికి రహదారి భద్రత ప్రాముఖ్యతను వివరిస్తారు. రద్దీ ప్రాంతాల్లో రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతున్న వృద్ధులు, పిల్లలకు సహాయం చేయడం కూడా వీరి బాధ్యతల్లో ఒకటి. పండుగలు, ర్యాలీలు, వీఐపీల పర్యటనల సమయంలో ట్రాఫిక్ పోలీసులకు చేదోడు వాదోడుగా ఉంటారు. ఈ కార్యక్రమం కోసం పోలీసులు నగరంలోని యువతతో మాట్లాడి, ట్రాఫిక్ నియంత్రణలో వారి పాత్ర ఎంత కీలకమో వివరించారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారి నుంచి 206 మందిని ఎంపిక చేశారు. వీరికి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ స్వయంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇవ్వడం విశేషం. ప్రమాదాలు జరగకుండా ఎలా పనిచేయాలి, ప్రజలతో ఎలా వ్యవహరించాలనే దానిపై ప్రత్యేక సూచనలు చేశారు. ఈ సోల్జర్స్ ప్రతిరోజూ ఉదయం 8-10 గంటల మధ్య లేదా సాయంత్రం 4-7 గంటల మధ్య రద్దీ సమయాల్లో 3 నుంచి 4 గంటల పాటు సేవలు అందిస్తారు. త్వరలోనే వీరికి ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేయనున్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ కార్యక్రమంలో చేరవచ్చని పోలీసులు తెలిపారు.

## మద్యం కుంభకోణం కేసులో అవినాశ్ రెడ్డికి బెయిల్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడైన ముప్పిడి అవినాశ్ రెడ్డికి సుప్రీం కోర్టులో(ాబజూతీవఎవ జశీబతీ) ఊరట లభించింది. అవినాశ్‌కు సుప్రీం కోర్టు రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది. మద్యం కుంభకోణం కేసులో ఏ-7గా ఉన్న అవినాశ్ రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం (ా×ు) మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుంది. కోర్టు అనుమతితో జరిగిన ఈ విచారణలో అవినాశ్ కీలక విషయాలు వెల్లడించినట్లు సమాచారం. మద్యం కుంభకోణంలో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పాత్ర, అంతిమ లబ్ధిదారుడికి సంబంధించిన విషయాలపై అవినాశ్ రెడ్డి వివరాలు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ స్కామ్‌లో రాజ్ కసిరెడ్డి ప్రధాన నిందితుడిగా ఉండగా, అవినాశ్ రెడ్డి ఆర్థిక నియంత్రణ, లావాదేవీలలో ముఖ్యపాత్ర వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసుకు సంబంధించి విచారణ ఇంకా కొనసాగుతోంది.

## కుప్పకూలిన రూపాయి.. 93 దాటి ఆల్ టైమ్ కనిష్ఠానికి!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల పరిణామాల నేపథ్యంలో అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచ సరఫరా వ్యవస్థలో అంతరాయాల కారణంగా ఇవాళ్టి ట్రేడింగ్‌లో రూపాయి భారీగా బలహీనపడింది. ఒకే రోజు 0.55 శాతం క్షీణించి, డాలర్‌కు 93.12 వద్ద కొనసాగుతోంది. బుధవారం నమోదైన 92.63 కనిష్ఠ స్థాయిని కూడా ఇది అధిగమించింది. పశ్చిమాసియాలో సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి రూపాయి విలువ దాదాపు 2 శాతం క్షీణించడం గమనార్హం. ప్రస్తుతం డాలర్/రూపాయి మారకం 92.8 స్థాయికి పైగా ట్రేడ్ అవుతోందని, ఇది రూపాయిపై ఒత్తిడిని సూచిస్తోందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. పెరుగుతున్న ముడి చమురు ధరలు, అంతర్జాతీయంగా పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గు చూపడం దీనికి ప్రధాన కారణాలని చెబుతున్నారు. రూపాయి విలువ కుప్పకూలినప్పటికీ, దేశీయ స్టాక్ మార్కెట్లు మాత్రం అనూహ్యంగా పుంజుకున్నాయి. సెన్సెక్స్ 900 పాయింట్లకు పైగా లాభపడగా, నిఫ్టీ దాదాపు 300 పాయింట్లు పెరిగింది. అయితే, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఖీ××లు) నికర అమ్మకందారులుగా కొనసాగుతున్నారు. గురువారం ఒక్కరోజే వారు రూ. 7,558.19 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించినట్లు ఎక్స్ఛేంజ్ డేటా స్పష్టం చేస్తోంది. మరోవైపు అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు కాస్త తగ్గాయి. ఇరాన్ నుంచి సముద్ర మార్గంలో ఉన్న ముడి చమురుపై ఆంక్షలను సడలించే అవకాశం ఉందని అమెరికా సంకేతాలు ఇవ్వడంతో ధరలు దిగివచ్చాయి.

## ఆస్తుల విషయంలో మేనల్లుడు, మేనకోడలికి జగన్ అన్యాయం చేశాడు: వైఎస్ విజయమ్మ



**హైదరాబాద్, పతాకం న్యూస్:** కుటుంబ ఆస్తుల పంపకాల్లో ఎన్‌సీఎల్‌టీ లో వివాదం కొనసాగుతున్న వేళ జగన్ తల్లి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సతీమణి విజయమ్మ మీడియాకు ఓ లేఖ విడుదల చేశారు. అందులో వైఎస్సార్సీపీ నేతలు చేస్తున్న ఆరోపణలకు పూర్తి స్పష్టత నిచ్చారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణించేవరకూ ఆస్తులన్నీ ఉమ్మడివేనని తేల్చిచెప్పారు. కుటుంబ ఆస్తుల పంపకాల్లో వివాదంపై వైఎస్సార్సీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు, విమర్శలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సతీమణి, జగన్ తల్లి వైఎస్ విజయలక్ష్మి ఓ లేఖను విడుదల చేశారు. లేఖలో కుటుంబ ఆస్తులపై లేఖలో విజయమ్మ వివరణ ఇచ్చారు. ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగలేదని లేఖలో స్పష్టం చేసిన విజయమ్మ, వైఎస్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని స్పష్టం చేశారు. ఆస్తులన్నీ నలుగురు మనవలకు సమానంగా పంచాలని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉద్దేశం, ఆదేశం కూడా అని విజయలక్ష్మి తేల్చిచెప్పారు. దగ్గర వాళ్లందరికీ తెలిసిన వాస్తవమిదేనని అన్నారు. ఎంవోయూలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు చెందాల్సినవేనని విజయమ్మ స్పష్టం చేశారు. అందుకే జగన్ ఎంవోయూ రాశారని చెప్పారు. నిజానికి షర్మిలకు తక్కువే రాశారన్న ఆమె, సరస్వతి సిమెంట్‌తో సహా ఎంవోయూలో లేని యెలహంక ల్యాండ్ కూడా షర్మిలదేనని చెప్పారు. ఇచ్చాను అని చెబుతున్న డబ్బు షర్మిల వాటాకు ఇచ్చిన డివిడెండ్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఆస్తుల పంపకం విషయంలో తన మేనల్లుడు, మేనకోడలికి జగన్ అన్యాయం చేశారన్న వైఎస్ విజయలక్ష్మి, ఎప్పటికైనా న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నానని తెలిపారు.ఇప్పుడు చదువుతున్న షర్మిల ఆస్తుల లాంటివి వైఎస్సార్ జగన్‌కు కూడా ఇచ్చారన్న విజయమ్మ అది ఆస్తి పంపకం కాదని అన్నారు. నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుకుకి కూడా తెలుసని పేర్కొన్నారు. మీరు ఎంత కాదన్నా దేవుడి న్యాయమే న్యాయమని విజయమ్మ తేల్చిచెప్పారు. గ్లోబల్స్ ప్రచారం మానుకోవాలని సూచించారు. అసత్యాల ప్రచారం మానుకోవాలని వైఎస్ఆర్ భార్యగా చేతులు జోడించి అడుగుతున్నానని తెలిపారు. దేవుని సాక్షిగా తాను రాసినవన్నీ వాస్తవాలు మాత్రమేనని స్పష్టం చేశారు. వైఎస్ జగన్, వైఎస్ షర్మిల మధ్య కుటుంబంలో సరస్వతి పవర్ ఆస్తుల వివాదం ఇంకా నడుస్తూనే ఉంది. దీనిపై కొద్ది రోజుల క్రితం వారి తల్లి వైఎస్ స్పందించారు. మా కుటుంబంలోని ఆస్తులకు సంబంధించిన పంపిణీ వివాదానికి స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటున్నానని వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు. అదే విధంగా ఈ వివాదంలో షర్మిలకు నేను బినామీగా లేదా ప్రతినిధిగా ఏ మాత్రం వ్యవహరించడం లేదంటూ ఆమె స్పష్టం చేశారు. అదే విధంగా ఇందులో వైఎస్ జగన్, భారతిలు ఇచ్చినటువంటి గిఫ్ట్‌డీడ్ ద్వారా తనకు సైతం ప్రయోజనం ఉందన్నది కాదనలేని వాస్తవమని వైఎస్ విజయమ్మ తేల్చి చెప్పారు. అందుకు అనుగుణంగా క్లాసిక్ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్‌కు కట్టాల్సిన ప్రతిఫలాన్ని చెల్లించి ఆ తర్వాత వాటాల కొనుగోలు ఒప్పందం చేసుకున్నానని విజయమ్మ తెలిపారు. అంతేకాకుండా ఈ పత్రాలను ఎవరూ కూడా తిరస్కరించలేరని వైఎస్ విజయమ్మ అన్నారు. దీనికితోడు నాపై ఉన్నటువంటి ప్రేమ, ఆప్యాయతలను వైఎస్ జగన్ సైతం ఏ మాత్రం నిరాకరించలేదనట్లు ఆమె వివరించారు. దీని ప్రకారం జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ చెన్నై బెంచ్‌కు వైఎస్ విజయమ్మ నివేదించడం గమనార్హం.

## కువైట్‌లోని కీలక రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి



**ఇరాన్:** గల్ఫ్ దేశాల్లోని కీలక చమురు సదుపాయాలపై ఇరాన్ దాడులు ఉధృతం చేసింది. కువైట్‌లో కీలకమైన మినా అల్ అహ్మదీ చమురు శుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడికి పాల్పడింది. ఇటీవల ఖతార్‌లోని రస్ లఫాన్ గ్యాస్ క్షేత్రం, సౌదీ అరేబియాలోని అరామ్‌కో చమురుక్షేత్రంపై ఇరాన్ దాడులు చేసింది.. పశ్చిమాసియాలోని అతిపెద్ద ఆయిల్ రిఫైనరీలలో ఈ మినా అల్ అహ్మదీ కూడా ఒకటి. డ్రోన్ దాడి నేపథ్యంలో రిఫైనరీలో భారీగా మంటలు చెలరేగాయి. అధికారులు వాటిని అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ దాడి నేపథ్యంలో ఎవరైనా గాయపడ్డారా, ఆస్తి నష్టం ఎంత అనే వివరాలు తెలియాల్సి ఉంది. ఈ రిఫైనరీ నిత్యం 7,30,000 బ్యారెళ్ల చమురును శుద్ధి చేస్తుంది. మరోవైపు, దుబాయ్ నగరం పైకి ఇరాన్ భారీ స్థాయిలో డ్రోన్లు ప్రయోగించింది. దుబాయ్ వైమానిక రక్షణ వ్యవస్థలు వాటిని అడ్డుకున్నాయి. ఈ క్రమంలో భారీ పేలుళ్లు వినిపించాయి. తమపై దూసుకొచ్చిన ఒక క్షిపణిని అడ్డుకున్నట్లు బహ్రెయిన్ తెలిపింది. క్షిపణి శకలాలు పడటంతో ఓ గోడౌన్‌లో మంటలు చెలరేగాయి.

## ఆన్‌లైన్ జూదానికి చెక్... మరో 300 యాప్‌లు, వెబ్‌సైట్లపై కేంద్రం వేటు

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్‌లపై కేంద్ర ప్రభుత్వం తన ఉక్కుపాదాన్ని కొనసాగిస్తోంది. దేశవ్యాప్తంగా అక్రమంగా కార్యకలాపాలు సాగిస్తున్న మరో 300 గ్యాంబ్లింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లను తాజాగా బ్లాక్ చేసింది. దీంతో ఇప్పటివరకు బ్లాక్ చేసిన వాటి సంఖ్య 8,400కు చేరిందని ప్రభుత్వ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. బ్లాక్ చేసిన వాటిలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు, రౌలెట్, స్లాట్స్ వంటివి అందించే ఆన్‌లైన్ క్యాసినోలు, బెట్టింగ్ ఎక్స్ఛేంజ్‌లు ఉన్నాయి. వీటితో పాటు సట్టా/మట్కా నెట్‌వర్క్‌లు, నిజమైన డబ్బుతో ఆడే కార్డ్ గేమ్ యాప్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. గతేడాది ఆగస్టులో పార్లమెంట్ ఆమోదించిన 'ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్, 2025' కింద ఈ చర్యలు తీసుకుంటున్నారు. 2025 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త చట్టం తర్వాతే సుమారు 4,900 వెబ్‌సైట్లను బ్లాక్ చేయడం గమనార్హం. ఈ చట్టం ప్రకారం... పోకర్, రమ్మీ, ఫాంటసీ స్పోర్ట్స్ వంటి నిజమైన డబ్బుతో కూడిన గేమ్‌లను అందిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష, భారీ జరిమానాలు విధిస్తారు. ఈ పరిశ్రమను నియంత్రించేందుకు 'ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా'ను కూడా ఏర్పాటు చేశారు.

# బొట్టవానిపాలెంలో బిపిఎల్ సీజన్-2 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం




**పరవాడ, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం రావాడ పంచాయతీ పరిధిలోని బట్టవాని పాలెంలో బట్టవానిపాలెం ప్రీమియర్ లీగ్ (బిపిఎల్) సీజన్-2 క్రికెట్ టోర్నమెంట్‌ను బట్టవానిపాలెం క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ పెద్దల సమక్షంలో ఘనంగా ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌కు గ్రామానికి చెందిన అనకాపల్లి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు దాలిబోయిన సంజీవరావు ఆర్థిక సహాయం అందించారు. నిర్వాహకులు వెల్లడించిన వివరాల ప్రకారం...విజేత జట్టుకు రూ.8,000 నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్ అందజేయనుండగా, రన్నరప్ జట్టుకు రూ.5,000 నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్ ఇవ్వనున్నారు. దీనితో పాటు బట్టవానిపాలెం క్రికెట్ జట్టుకు టీ-షర్ట్స్‌ను కూడా దాలిబోయిన సంజీవరావు స్పాన్సర్ చేశారు. ఈ పోటీలు బట్టవానిపాలెంలోని వినాయక గుడి ప్రాంగణంలో జరుగుతున్నాయి. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ టోర్నమెంట్ ఉపయోగపడుతుందని పంచాయతీ పెద్దలు, గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, మండల వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరావు, మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్న, మండల వైసిపి అధ్యక్షులు కోన రామారావు, మాజీ ఎంపీటిసి జోగినాయుడు, బిజెపి మండల కమిటీ కార్యదర్శి ఎం. వీరునాయుడు, వైసిపి ప్రచార కమిటీ పల్లా గోవింద్, గ్రామ పెద్దలు, యువత, క్రీడాకారులు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా ఉన్న బచ్చింత- దారగెడ్డ రహదారి



**కొయ్యూరు, పతాకం న్యూస్:** మండలంలోని బచ్చింత- దారగెడ్డ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి ఏడాది క్రితమే ఈ రోడ్డు పూర్తి కావలసి ఉన్నప్పటికీ ఇప్పటికీ అతీగతీ లేకుండా ఉంది. మెటల్ వేసి వదిలేయడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. మండలంలోని మూలపేట పంచాయతీ కొండ శిఖర పాలమామిడి, కొత్తవీధి, దారగెడ్డ గ్రామాలకు బచ్చింత గ్రామం నుంచి సుమారు 8 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డుతో పాటు బచ్చింత సమీపంలో వంతెన నిర్మాణానికి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.8 కోట్లు మంజూరయ్యాయి. వాస్తవానికి ఈ రహదారి నిర్మాణాన్ని 2025 మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలి. కానీ ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. ఈ పనులను గుంటూరుకు చెందిన వెంకటేశ్వరావు అనే కాంట్రాక్టర్ అప్పట్లో టెండర్లలో దక్కించుకున్నారు. బచ్చింత సమీప వాగుపై రూ.60 లక్షల వ్యయంతో వంతెన నిర్మించారు. అలాగే పాలమామిడి వరకు సుమారు 5 కిలోమీటర్లు మట్టి పనులు పూర్తి చేశారు. మధ్యలో గల ఘాట్‌రోడ్డు మలుపుల వద్ద సీసీ రోడ్డు నిర్మించారు. ఈ రహదారి మధ్యలో నాలుగు కల్వర్టుల నిర్మాణం పూర్తి చేశారు. పాలమామిడి నుంచి కొత్తవీధి వరకు సుమారు కిలోమీటరు మేర మట్టి పనులు పూర్తి చేసి మెటల్ స్టోన్ డస్ట్ వేశారు. అయితే కొత్తవీధి నుంచి దారగెడ్డ వరకు కనీసం మట్టి పనులు చేపట్టలేదు. సుమారు రెండేళ్ల క్రితం పనులను అర్థంతరంగా నిలిపివేశారు. చేపట్టిన పనులకు ప్రభుత్వం రూ.3.6 కోట్లు చెల్లించేసినా ఆ తరువాత పనులు మాత్రం ముందుకు సాగలేదు. దీంతో పలు గ్రామాల గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. దీనిపై గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం డీఈఈ రఘునాథరావు వివరణ కోరగా ఇప్పటి వరకు చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించామని, అయితే కురదల పనులకు చెల్లింపులు జరగక నిర్మాణాలు నిలిచాయన్నారు. దీనికి సంబంధించి త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని, నిధులు రాగానే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

## పరిహారం చెల్లించకుండా మిట్టల్ ప్లాంట్‌కు భూమిపూజ దారుణం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌ప్లాంట్‌కు ఈ నెల 23న భూమి పూజకు ఏర్పాట్లు చేయడం సరికాదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అన్నారు. పట్టణంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ మేరకు పై అంశంపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ వైజాగ్ -- చెన్నరు ఇండిస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టులో భాగంగా నక్కపల్లి మండలంలో రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, అమలాపురం, డిఎల్.పురం పంచాయతీల పరిధిలో 11 గ్రామాల నుంచి 5500 ఎకరాల భూమిని రైతుల నుండి బలవంతంగా ప్రభుత్వం సేకరించిందని గుర్తు చేశారు. అందులో 2100 ఎకరాల భూమిని ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. అయితే నిర్వాసితులైన రైతులు, కూలీలు, వృత్తిదారులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇవ్వాల్సిన పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలను ఇప్పటి వరకూ పూర్తిగా అమలు చేయలేదన్నారు. నిర్వాసిత కాలనీలో ఎలాంటి సౌకర్యాలూ కల్పించకుండా ఆగమేఘాలమీద ప్రస్తుతం వారు నివసిస్తున్న ఇళ్లను నేలమట్టం చేశారన్నారు. నిర్వాసితులను ఇలా నడిరోడ్డుపైకి నెట్టివేయడం సరైనదా ? అని ప్రశ్నించారు. రైతులు, నిర్వాసితులకు పూర్తిస్థాయి ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని, ఆర్ కార్డులు, పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని, కంపెనీ నిర్మాణ దశలో నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. జిరాయితీ భూములతో సమానంగా డి ఫారం సాగు భూములకు కూడా పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలన్నారు. వివాహమైన ఆడపిల్లలకు, 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు భూసేకరణ సందర్భంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. ఇళ్లు కోల్పోయి నిర్వాసితులైన కుటుంబాలకు ప్రస్తుతం ఇచ్చిన ప్యాకేజీ రూ.8,98,000 అంగీకారం కాదని, పెరిగిన ఇంటి నిర్మాణ సామగ్రి ధరలకు అనుగుణంగా రూ.25 లక్షల ప్యాకేజీ పెంచి ఇవ్వాలని కోరారు.

## ఎట్టకేలకు కొత్తపాలెం రోడ్డుకు మోక్షం



**పాడేరు, పతాకం న్యూస్:** పాడేరు మండలం మారుమూల కొత్తపాలెం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. స్థానిక ఘాట్ మార్గంలో అమ్మవారి పాదాలుకు సమీప కాఫీ తోటల్లోంచి కొత్తపాలెం వెళ్లేందుకు సుమారుగా మూడు కిలోమీటర్ల రోడ్డు మార్గం ఉంది. ఆ మార్గంలోనే ఓనూరు, నందిగరువు, కొత్తపాలెం వాసులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే అది రెండు దశాబ్దాల క్రితం నిర్మించినది కావడంతో ప్రస్తుతం రాళ్లు తేలి, గుంతలతో అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ఓనూరు, నందిగరువు, కొత్తపాలెం వాసులతో పాటు అటుగా ఉన్న మరికొన్ని గ్రామాలకు చెందిన గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. అయితే ఆ రోడ్డును మెరుగుపరచాలని ఆయా ప్రాంతీయులు చాలా ఏళ్లుగా కోరుతున్నా ఫలితం లేకపోయింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నందిగరువు పర్యటనతో కొత్తపాలెం రోడ్డుకు కొంత వరకు మోక్షం కలిగింది. పవన్‌కల్యాణ్ నందిగరువు చేరుకునేందుకు గతుకులుగా ఉన్న కొత్తపాలెం రోడ్డుపై ప్రయాణించాల్సి ఉండడంతో, ఘాట్ మార్గం నుంచి ఓనూరు జంక్షన్ వరకు ఉన్న ఒకటిన్నర కిలోమీటర్ల రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి, వాహనాల రాకపోలకు అనువుగా మెరుగుపరిచారు. దీంతో ప్రస్తుతానికి కొత్తపాలెం రోడ్డు సగం బాగుపడింది. కాగా నందిగరువు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు తమ రోడ్డు సమస్యను కొత్తపాలెం వాసులు తెలిపారు. స్పందించిన ఆయన రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామని గిరిజనులకు హామీ ఇచ్చారు. దీంతో భవిష్యత్తులో కొత్తపాలెం రోడ్డు మొత్తం అభివృద్ధి జరిగే పరిస్థితి ఉండడంతో ఆయా ప్రాంతీయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రమదానంతో మట్టిరోడ్డు నిర్మాణం



**అనంతగిరి, పతాకం న్యూస్:** రహదారి సౌకర్యం లేక మండలంలోని పినకోట పంచాయతీ పందిరిమామిడి, కర్రిమామిడి గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్లడానికి, నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడానికి మార్గం లేక అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేకపోవడంతో శ్రమదానంతో రోడ్డు ఏర్పాటు చేసుకోవాలని ఆ రెండు గ్రామాల ప్రజలు నిర్ణయించుకున్నారు. ఆ రెండు గ్రామాలకు చెందిన పది గిరిజన కుటుంబాలు గునపం, పార పట్టుకుని పనిలో దిగారు. బొర్రాపాలెం గ్రామం నుంచి పందిరిమామిడి, కర్రిమామడి గ్రామాలకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం ఉండగా, ఒక కిలోమీటరు మేర రోడ్డును నిర్మించుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

## పెచ్చులూడిన పాఠశాల భవనం స్లాబ్



**మెళియాపుట్టి, పతాకం న్యూస్:** చదువుకునేందుకు ఈ పాఠ శాలకు రావాలంటే విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ భయపడుతున్నారు. మండలంలోని పదనాపురం మండల పరిషత్ పాఠశాలలో 10మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్నాళ్ల పాటు ఒక ఇంటిలో పాఠశాలు చెప్పేవారు. అయితే ఆ ఇం టిని ఖాళీ చేయాల్సి రావడంతో తిరిగి మళ్లీ అదే శిథిలావస్థలో ఉన్న పాఠశాలలోనే ప్రస్తుతం తరగ తులు నిర్వహిస్తున్నారు. గదిలో పై కప్పు స్లాబ్ అంతా పూర్తిగా పాడైవడం వల్ల ఎవరిపై ఎప్పుడు పోడిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించాలని విద్యార్థుల తల్లిందద్రులు కోరుతున్నారు.

## పర్యాటకుల కోసం 'విస్టా'



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం వచ్చే పర్యాటకులకు ఉపయోగపడేలా వీఎంఆర్‌డీఏ కొత్తగా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని పేరు విశాఖ ఇంటిగ్రేటెడ్ స్మార్ట్ టికెటింగ్ యాప్ (విస్టా). వీఎంఆర్‌డీఏకు చెందిన మ్యూజియాలు (కురుసుర, టీయూ-142, యుహెచ్-3 హెచ్, సీ హ్యారియర్, తెలుగు మ్యూజియం), కైలాసగిరి, బీచ్ రోడ్డులో వుడా పార్కు, సిటీ సెంట్రల్ పార్క్, తెన్నేటి పార్క్, తొట్లకొండ...ఇలా అన్నింటికి ఉపయోగపడేలా దీనిని రూపొందించారు. ఆయా మ్యూజియాలకు వెళ్లి, క్యూలో నిల్చొని టికెట్ తీసుకోవలసిన అవసరం లేకుండా యాప్‌లోనే ఏ రోజు ఏ సమయానికి ప్రవేశం కావాలనుకుంటే ఆ టైమ్ స్లాట్‌లో ఎక్కడి నుంచైనా టికెట్ తీసుకోవచ్చు. ఇది పర్యాటకులతో పాటు సంస్థకూ ఉపయుక్తంగా ఉండనుంది. టికెట్ల విక్రయాలు, ఆదాయంలో పారదర్శకతను పెంచుతుంది. ఈ యాప్ వీఎంఆర్‌డీఏ కార్యాయంలో చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ తేజ్‌భరత్, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ మొబైల్‌లోనే ఈ యాప్ ద్వారా టికెట్లు తీసుకోవచ్చునన్నారు. అంతే కుండా వీఎంఆర్‌డీఏకు నగరంలో ఉన్న కల్యాణ మండపాలు, వేదికలను కూడా ఇదే యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చునన్నారు. త్వరలో దీనిని విదేశీ పర్యాటకులకు కూడా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వీఎంఆర్‌డీఏకు పనులపై వచ్చేవారు చాలామంది లేఖలు తపాల్స్‌లో సమర్పిస్తారు. ఒక్కోసారి అవి కనిపించకుండా పోతున్నాయని ఫిర్యాదులు రావడంతో తపాల్స్ అన్నీ ఆన్‌లైన్ చేసి, ట్రాకింగ్‌కు అనుకూలంగా ఉండేలా 'స్మార్ట్ తపాల్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' పేరుతో మరొక యాప్‌ను రూపొందించారు. దానిని కూడా ఇదే కార్యక్రమంలో ప్రారంభించారు. దీని వల్ల సిబ్బందిలో జవాబుదారీతనం పెరుగుతుందని చైర్మన్, కమిషనర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో యాప్‌ను రూపొందించిన అమరావతి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రతినిధులు, వీఎంఆర్‌డీఏ సెక్రటరీ మురళి, సీఈ వినయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** పరిపాలనతో పాటు పౌర సేవలు మరింత సులభంగా అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్‌పై యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రధానంగా నిరక్ష్యరాస్యులు, ఇంటర్నెట్ సదుపాయం లేని గిరిజన ప్రాంతాల్లో తొలుత దానిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సచివాలయ సిబ్బంది ద్వారా చర్యలు చేపడుతోంది. వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆశయం, దానిని ఎలా వినియోగించాలనే అంశాలపై సిబ్బంది ఇంటింటిలా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికి 55 శాతం ప్రగతి సాధించగా, ఇంటింటా ప్రచారం కొనసాగుతున్నది. ప్రజల్లో వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు యంత్రాంగం రంగంలోకి దిగింది. జిల్లాలోని మొత్తం పదకొండు మండలాల్లో 212 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న లక్షా 92 వేల 60 ఇళ్లను సందర్శించాలనే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నారు. ఇంటర్నెట్ సదుపాయం ఉన్న ప్రాంతాల్లోని గ్రామాల్లో ఇంటింటికీ సచివాలయ సిబ్బంది వెళ్లి వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు. తొలుత ప్రభుత్వ సేవలు పొందడానికి 'మన మిత్ర 9552300009' నంబర్‌ను ఎలా వినియోగించుకోవాలనే దానిపై తర్ఫీదు ఇస్తున్నారు. తరువాత దాని ద్వారా ఎటువంటి సేవలు, ఎలా పొందాలనే అంశాలను ప్రజలకు వివరిస్తున్నారు. అయితే ఏజెన్సీలో అధిక శాతం ప్రజలు నిరక్ష్యరాస్యులు కావడంతో పాటు అనేక ప్రాంతాలకు ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులో లేకపోవడం ఇందుకు ప్రతిబంధకంగా మారుతున్నది. దీంతో ఇప్పటికి జిల్లా వ్యాప్తంగా 86,281 ఇళ్లను మాత్రమే సందర్శించి వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించగలిగారు.

## ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించడానికే యుద్ధాలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి యుద్ధాలను మోడీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు ఆరోపించారు. ప్రపంచశాంతి వర్ధిల్లాలంటూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద, సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ శాంతి కోరుతూ ముందుగా పావురాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేటీకరణ అనేది సామ్రాజ్యవాదం లో ఒక భాగం అన్నారు. ఇప్పుడు ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ వంటి దేశాలు యుద్ధం సాగించడం అందులో భాగం అన్నారు.యుద్ధం వల్ల వంటగ్యాస్ లభ్యం కాక అనేక ఇబ్బందులను, అన్ని తరగతుల ప్రజలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. విశ్వ గురువు అని చెప్పుకునే మోడీ విశ్వశాంతిని చేకూర్చవలసిన బాధ్యతను కూడా ఆయనదే అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం. సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కర్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ, సహజ వనరులైన పెట్రోలియం బావులను అమెరికా సామ్రాజ్యవాదం టార్గెట్ చేస్తూ, పెట్రోలియం నిక్షేపాలను సర్వనాశనం చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా యుద్ధానికి స్వస్తి పలకాలన్నారు.

## శ్మశానాల వద్ద సౌకర్యాలు లేమి!



**విజయనగరం, పతాకం న్యూస్:** పల్లెల్లో జీవనం కష్టమే అనుకుంటే, మరణానంతర ప్రయాణం ఇంకా కఠినంగా మారుతోంది. చివరి సంస్కారాల కోసం వెళ్లే మార్గం సైతం లేకుండా ప్రజలు పడుతున్న ఇబ్బందులు మానవత్వానికే సవాలుగా మారుతుంది. వర్షం పడితే బురదలో నడుస్తూ, ఎండకాలంలో నీటి కోసం తిరుగుతూ, దహన సంస్కారాల సమయంలో కుటుంబ సభ్యులు అనుభవిస్తున్న బాధలు హృదయ విదారకంగా ఉన్నాయి.సంతకవిటి మండలంలోని పలు గ్రామాల్లో శ్మశానాలకు వెళ్లేందుకు దారులే లేకపోవడంతో మృతదేహాలను మోసుకుంటూ పొలాల గుండా తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల వర్షాకాలంలో నీరు నిలిచి, సంస్కారాలు నిర్వహించడం అసాధ్యంగా మారుతోంది. ఎండాకాలం వస్తే నీటి కొరత మరింత తీవ్రంగా మారి, చివరి కర్మలు పూర్తి చేయడమే కష్టసాధ్యమవుతోంది.బలరాంపేటలో పరిస్థితి మరింత విచారకరం. గ్రామానికి కేటాయించిన స్థలం లేకపోవడంతో రహదారి పక్కనే దహన సంస్కారాలు నిర్వహించాల్సి వస్తోంది. ఇది గ్రామస్థులకు మాత్రమే కాకుండా ప్రయాణికులకు కూడా అసౌకర్యంగా మారుతోంది. జి.ఎన్.పురంలో దళితులకు ప్రత్యేక స్థలం లేక చెరువుల వద్ద సంస్కారాలు నిర్వహించాల్సి రావడం సామాజిక అసమానతలను బహిర్గతం చేస్తోంది.పలు గ్రామాల్లో శ్మశానాలు పంట పొలాలకు ఆనుకుని ఉండటం వల్ల అవి ఆక్రమణలకు గురవుతున్నాయి. మరికొన్ని చోట్ల ప్రధాన రహదారుల పక్కనే ఉండి ప్రహరీ గోడలు లేకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. కనీస సదుపాయాలైన నీటి వసతి, షెడ్‌లు, విశ్రాంతి గదులు లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మంతిన గ్రామంలో దళితులే స్వచ్ఛందంగా శ్మశానాన్ని శుభ్రం చేసుకోవాల్సి రావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. తమకు రహదారి, చిన్న భవనం అయినా నిర్మిస్తే చాలనేది తమ కోరిక అని గ్రామస్థులు వేదన వ్యక్తం చేస్తున్నారు. బలరాంపేటలో మరోవైపు, రైతులు ఆక్రమించడంతో శ్మశానం లేక ప్రజలు రోడ్డుపైనే సంస్కారాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.కావలిలోని నాగావళి నది గట్టు పైనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. కనీసం భవనం, రహదారి లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. మండల వ్యాప్తంగా అనేక గ్రామాల్లో రహదారులు, భవనాలు లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. ముఖ్యంగా దళిత శ్మశానాల్లో ఈ లోటు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. చినుకు పడితేనే బురదమయమైపోయే ప్రదేశాల్లో, మృతదేహాలను తీసుకెళ్లడం కుటుంబాలకు మానసికంగా, శారీరకంగా భారంగా మారుతోంది.ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, గత కొన్ని సంవత్సరాలుగా ఈ సమస్యల పరిష్కారానికి నిధులు అందకపోవడం. స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ, అమలు దశలోకి రావడం లేదు. దీంతో ప్రజలు చివరి ప్రయాణానికైనా గౌరవం దక్కదా? అని ప్రశ్నిస్తున్నారు.మండలంలోని 35 గ్రామాల పరిధిలో ఉన్న శ్మశానవాటికల్లో సరైన మౌలిక సదుపాయాల కల్పన లేకపోవడం, 18 గ్రామాలకు సంబంధించిన శ్మశాన వాటికల్లో అంత్యక్రియలు నిర్వహించే భవనాలు లేకపోవడం, 21 శ్మశాన వాటికలకు సరైన రహదారులు లేకపోవడం విస్మయానికి గురిచేస్తుంది. మండలంలోని 10 దళిత శ్మశానవాటికల్లో రహదారి, భవనాలు, మంచినీటి సదుపాయం లేవు. సంతకవిటి, మంతిన, పుల్లిట, పొడలి, ఎస్.రంగరాయపురం, తలాడ, హోజరాం, గోవిందపురం, యంపలపేట, మండవకురిటి, కొండగూడెం, గ్రామాల్లో అస్సలు సదుపాయాలు లేవు.ఇప్పటికైనా సంబంధిత శాఖలు స్పందించి, కనీస మౌలిక సదుపాయాలైన రహదారులు, నీటి వసతి, ప్రహరీ, షెడ్‌లు ఏర్పాటు చేస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. మరణానంతర సంస్కారాలు కూడా గౌరవంగా జరగాలంటే, ఈ నిర్లక్ష్యానికి ముగింపు పలకాల్సిన అవసరం అత్యవసరం.

## ఇరాన్ సహా 11 దేశాల గగనతలంలోకి వెళ్లొద్దు : భారత విమానయాన సంస్థలకు డీజీసీఏ సూచన




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మధ్యప్రాచ్యంలో యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో, భద్రతా కారణాల దృష్ట్యా ఇరాన్‌తో సహా 11 దేశాల గగనతలంలోకి వెళ్లొద్దని భారత విమానయాన సంస్థలకు విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ కఠినమైన సూచనలు జారీ చేసింది. ఇరాన్ సైనిక, ఇంధన కేంద్రాలపై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఆ ప్రాంతంలోని గగనతలం తీవ్ర ప్రమాదకర స్థితిలో ఉందని వచ్చిన నివేదికల తర్వాత ఈ చర్య తీసుకున్నారు. ఇరాన్, ఇజ్రాయెల్, లెబనాన్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఒమన్, ఇరాక్, జోర్డాన్, కువైట్, ఖతార్ దేశాల గగనతలాలను 'అధిక ప్రమాదం'గా ఉన్న జాబితాలో చేర్చారు. ఈ దేశాల మీదుగా అన్ని ఎత్తులలోనూ విమాన ప్రయాణాలను నివారించాలని ఆ ఆదేశంలో పేర్కొన్నారు. ఒకవేళ ఒమన్, సౌదీ అరేబియా మీదుగా విమానాలను నడపాల్సి వస్తే, 32,000 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో మాత్రమే ప్రయాణించాలని డీజీసీఏ స్పష్టం చేసింది. అత్యాధునిక క్షిపణులు, డ్రోన్‌ల ఉనికి పౌర విమానాలకు ముప్పు కలిగిస్తుందని డీజీసీఏ హెచ్చరించింది. విమానాలను తప్పుగా గుర్తించే లేదా అవి సైనిక కార్యకలాపాలలో పాలుపంచుకునే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వంటి విమానయాన సంస్థలు పశ్చిమ ఆసియా దేశాలకు తమ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశాయి. యూరప్, అమెరికాకు వెళ్లే విమానాలను ఎక్కువ దూరాలున్న సురక్షిత మార్గాలకు మళ్లిస్తారు. దీనివల్ల ప్రయాణ సమయాలు పెరుగుతాయి. ప్రస్తుత మార్గదర్శకాలు మార్చి 28 వరకు అమలులో ఉంటాయని, పరిస్థితిని అంచనా వేసిన తర్వాత వాటిని సవరిస్తామని డీజీసీఏ తెలిపింది. సిరియా, యెమెన్ గగనతలాన్ని నివారించాలన్న మునుపటి ఆదేశం ఇప్పటికీ అమలులో ఉంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశం పరిస్థితిని సమీక్షించింది. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, టిక్కెట్ల ధరలను అధికంగా పెంచకుండా చూసుకోవాలని విమానయాన సంస్థలకు సూచించారు.

# విద్యావిధానంలో మార్పులు... ఇక టెన్త్ పరీక్షలు ఉండవు: రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఫోన్ ట్యాపింగ్ అరెస్టులు, సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి వ్యవహారం, విద్యా విధానం అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడిన ఆయన, విద్యా విధానంలో కీలక మార్పులు తెస్తున్నామని స్పష్టం చేశారు. ఇక టెన్త్ పరీక్షలు ఉండవని చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విధానం ఉంటుందని, దీనిని మున్ముందు అమలుచేస్తామని అన్నారు. మూసీ ప్రక్షాళన ఆగదని, ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. జగిత్యాలకు చెందిన తమ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి వ్యవహారాన్ని టీపీసీసీ అధ్యక్షుడు, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ చూసుకుంటారని తెలిపారు. అటు, ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు కొనసాగుతాయని తెలిపారు. చట్టప్రకారమే ఈ దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు. విద్యావిధానంలో మార్పులు చేస్తున్నామని, ఇక పదో తరగతి బోర్డు పరీక్షలు ఉండబోవని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు ఏవని విపక్షాలు ప్రశ్నిస్తుండటంపై కూడా ముఖ్యమంత్రి స్పందించారు. విచారణ జరపకుండానే అరెస్టులు చేయలేం కదా అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావుకు సిద్దిపేటకు చెందిన చక్రధర్ కేసులోనే క్లీన్ చిట్ వచ్చిందని తెలిపారు. పదేళ్లు బీఆర్ఎస్ చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్లు చేసిన తప్పులకు చెవిలో పువ్వులు కాదని, వీపుపై బండలు పెట్టాలని అన్నారు. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణకు ఇటీవల కేంద్రం అనుమతి ఇచ్చిందని, ఇప్పటికే అరవింద్ కుమార్‌ను సస్పెండ్ చేశామని అన్నారు.

## నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయం



**పార్వతీపురం, పతాకం న్యూస్:** నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. మండలంలోని డోకిశీల పంచాయతీ తేలునాయుడువలస నుంచి గంజిగడ్డ వరకు మంజూరైన బీటీ రహదారి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోకిశీల గ్రామాన్ని కంటిరెప్పలా చూసుకుంటాన న్నారు. అభివృద్ధికి కేరాఫ్‌గా నియోజకవర్గం ఉండాలన్నదే ధ్యేయమన్నా రు. కార్యక్రమంలో కొప్పుల వెలమ, నాగవంశపు కార్పొరేషన్ డైరెక్టర్లు జి.వెంకటనాయుడు, శంకరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు బోను దేవీచం ద్రమౌళి బొండపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు జి.చంద్రమౌళి పాల్గొన్నారు.

## మనస్సున దాతలు ఆదుకోవాలి



**చిత్తూరు, పతాకం న్యూస్:** ఎస్ఆర్‌పురం మండలం మెదవాడ గ్రామానికి చెందిన అశ్విని, ప్రకాష్ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దోడు ఆరోగ్యంగా ఉన్నా.. రెండేళ్ల వయసున్న దర్శన్ లంగ్స్ వ్యాధితో బాధ పడుతున్నాడు. డ్రైవర్ పనిచేసే ప్రకాష్, గృహిణి అశ్విని, ఇప్పటికే రూ.8-రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. వేలూరు సీఎంసీలో చూపించగా, వ్యాధి తీవ్ర రూపం దాల్చడంతో రూ.లక్షల్లో ఖర్చవుతుందని అంచనా వేశారు. రెక్కాడితే గానీ డొక్కాడని స్థితిలో ఉన్న ఆ తల్లిదండ్రులు.. ఇక మెరుగైన వైద్యం అందించే పరిస్థితిలో లేరు. వైద్యం అందించే వరకు దర్శన్ సహజ శ్వాస తీసుకోలేని పరిస్థితి ఉండడంతో.. కృత్రిమ శ్వాస అందించేందుకు రూ.50 వేలు పెట్టి బైపాప్ మిషన్‌ను కొనుగోలు చేశారు. తల్లిదండ్రులు ఎక్కడికీ వెళ్లకుండా ఈ మిషన్ ద్వారా ఇంట్లోనే చిన్నారికి కృత్రిమ శ్వాస అందిస్తున్నారు. ఇలాంటి సమయంలో దాతలు ముందుకొచ్చి తమ బిడ్డకు ప్రాణం పోయాలని అభ్యర్థిస్తున్నారా తల్లిదండ్రులు. దాతలెవరైనా 8008769140 నెంబరులో సంప్రదించాలని, ఫోనుపే ద్వారా ఈ నెంబర్‌కు ఆర్థికసాయం చేయాలని ప్రకాష్ కోరుతున్నారు.

## గిరిజనుల ముంగిట కార్పొరేట్ వైద్యం




**సాలూరు, పతాకం న్యూస్:**మన్యం ప్రాంత గిరిజనుల దశాబ్దాల కల నెరవేరుతోంది. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గ కేంద్రంలో అత్యాధునిక వసతులతో నిర్మించిన వంద పడకల ఏరియా ఆసుపత్రి అట్టహాసంగా ప్రారంభం కానుంది. గిరిజన ప్రాంత పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తోంది. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, ఈ ఆసుపత్రి నిర్మాణం వెనుక సుదీర్ఘ చరిత్ర ఉంది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో గిరిజన జిల్లా ఆవశ్యకతను గుర్తించి, నాటి ఎమ్మెల్సీ (ప్రస్తుత రాష్ట్ర మంత్రి) గుమ్మిడి సంధ్యారాణి చొరవతో దీనికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వ హయాంలో నాటి డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పర్యవేక్షణలో సుమారు రూ.17 కోట్ల వ్యయంతో భవన నిర్మాణం, మౌలిక సదుపాయాల పనులు వేగవంతమయ్యాయి. పనులు చివరి దశకు చేరుకున్న తరుణంలో ప్రభుత్వం మారడం, తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం చొరవతో మిగతా పనులు కూడా పూర్తయి నాడు శంకుస్థాపన చేసిన సంధ్యారాణి నేడు మంత్రి హోదాలో స్వయంగా దీనిని ప్రారంభించనుండటం విశేషం.గిరిజనుల్లో హర్షాతిరేకాలుదూర ప్రాంతాలైన విశాఖపట్నం, విజయనగరం వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే వంద పడకల ఆసుపత్రి అందుబాటులోకి రావడంపై స్థానిక గిరిజనులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 'రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి'



**విజయనగరం, పతాకం న్యూస్:** రహదారుల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పన కు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నా రు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్, దాసన్నపేట రైతు బజా రు జంక్షన్ మీదుగా కొత్తపేట నీళ్ల ట్యాంకు వరకూ రూ.3కోట్లతో 4.30 కిలోమీటర్లు మేర చేపట్టనున్న రోడ్డు పనులకు రింగురోడ్డులోని షిర్డీసాయి ఆలయం సమీ పంలో వారు శంకుస్థాపన చేశారు. ఈసం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా, ప్రాధాన్యత క్రమంలో రోడ్ల ఏర్పాటుకు కృషి చేస్తోందని చెప్పారు. ఎంపీ మాట్లాడు తూ విజయనగరం పార్లమెంటు పరిధిలో ని అన్ని రోడ్లను దశలవారీగా ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పారు. అలాగే విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ జాబ్ క్యాలెండర్‌ను విడుద ల చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి, బీజేపీ నాయకుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, గంటా రవి, అనురాధ బేగం, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్‌తో పాటు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిపో మేనేజర్ వేధింపులతో.. కార్మికుడు ఆత్మహత్యాయత్నం



**కడప, పతాకం న్యూస్:** కడప జిల్లా రాజంపేట అన్నమయ్య డిపోలో పనిచేస్తున్న కార్మికులపై డిపో మేనేజర్ వేధింపులు రోజురోజుకు అధికమవుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు నిదర్శనమే గ్యారేజీలో పనిచేస్తున్న ఎస్.వి.ఎస్ ప్రకాష్ ను గత కొన్ని రోజుల నుండి డిపో మేనేజర్ వేధించడంతో శుక్రవారం మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు. వెంటనే కార్మికులు ప్రకాష్ ను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం డిపోలో పనిచేస్తున్న కార్మికులకు తెలిసిన వెంటనే యూనియన్లకు అతీతంగా ప్రభుత్వ ఆసుపత్రికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి బీ.సీ శేఖర్ పాత్రికేయులతో మాట్లాడుతూ .... డిపో మేనేజర్ వేధింపులు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయన్నారు. వేధింపులు భరించలేక గతంలో ఆర్టీసీ డ్రైవర్ కూడా చనిపోవడం జరిగిందన్నారు. స్రీ శక్తి విజయం కోసం కార్మికులు అహర్నిశలు కృషి చేస్తూ ముఖ్యమంత్రి నుంచి సైతం ప్రశంసలు అందుకుంటుంటే డిపో మేనేజర్ మాత్రం కార్మికులను వేధించడం మానుకోలేదన్నారు. కార్మికుల సమస్యల పట్ల పలుమార్లు మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు డిపో మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జీవో నెం.5ని ఉపసంహరించుకోవాలి



**పార్వతీపురం, పతాకం న్యూస్:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం షాపులు.. ఇతర వాణిజ్య సంస్థలు 24 గంటలు తెరిచి ఉంచేలా అనుమతిస్తూ జిఒ నెంబర్ 5 విడుదల చేసిందని, ఈ జిఒ కార్మిక హక్కులను హరించే విధంగాను, పని భారం పెంచే విధంగాను ఉందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ విమర్శించారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో పార్వతీపురంలోని సుందరయ్య భవనం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక హక్కులను హరించే విధంగా, అనేక సంవత్సరాలుగా సాధించుకున్న కార్మిక చట్టాల మౌలిక లక్ష్యాలకు విరుద్ధంగా నిర్ణయాలు చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత దెబ్బతీసే విధంగా లేబర్ కోడ్‌లను దేశంలో అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. దాంతోపాటు కార్మికులను 24 గంటలు పని చేయించుకునేందుకు యాజమాన్యాలకు అనుమతించడం ద్వారా కార్మికులపై పనిభారం పెరుగుతుందని విమర్శించారు. ఇలాంటి అవకాశాలు యాజమాన్యాలకు కల్పించడం వల్ల శ్రమదోపిడీ పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిఒ 5 వల్ల చిన్న చిన్న షాపులు, హోటల్, షాపింగ్ మాల్స్‌లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు తీవ్రమైన నష్టం వాటిల్లనుందని తెలిపారు.

## ప్రమాదకరంగా కల్వర్టులు



**తూర్పు గోదావరి, పతాకం న్యూస్:** మండలంలో పలు ఆర్ అండ్ బి రోడ్డు మార్గాలు ప్రమాదకరంగా మారాయి. ఆదమరిచి వెళ్తే ప్రాణాలకే ప్రమాదకరంగా నిలుస్తున్నాయి. కల్వర్టులకు రక్షణ గోడలు లేకపోవడంతో పాటు కనీసం సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదపు అంచున భయంగా రాకపోకలు సాగించాల్సి వస్తుందని ప్రజల వాపోతున్నారు. మండలంలోని కొవ్వూరుపాడు ఆర్అండ్బి రోడ్డు మార్గంలో కల్వర్టులు ఉన్నాయి. వాటికి రక్షణ గోడలు ఏర్పాటు చేయలేదు. దీంతో రోడ్డు మార్జిన్, రోడ్డు సైతం కోతకు గురైంది. పలు సందర్భాలలో ద్విచక్ర వాహనదారులు ఆప్రాంతంలో అదుపుతప్పి పడి ప్రమాదాలకు గురయ్యారు. అలాగే వేలచింతలగూడెం శివారు ఆర్ అండ్ బి రోడ్‌లో ఉన్న కల్వర్టుకు ఒకవైపు రక్షణ గోడ కుంగిపోయి పడిపోయింది. దీంతో రోడ్డు మార్జిన్, షోల్డర్ లేకపోవడంతో ఆ ప్రదేశం ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికులు ఆదమరిస్తే ప్రాణాలకు ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. గోపాలపురం శివారు కరిచర్లగూడెం వైపుగా వెళ్లే నేషనల్ హైవే రోడ్డులో తాడిపూడి కాలువ క్రాసింగ్ వద్ద రోడ్ బ్రిడ్జ్ ఉంది. ఈ బ్రిడ్జి ప్రమాదాలకు నిలయంగా మారింది. అనేక భారీ లారీలు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలు ఇక్కడ పలుమార్లు చోటు చేసుకున్నాయి. ఒకటి రెండు లారీలు అదుపుతప్పి బ్రిడ్జ్ రక్షణ గోడను ఢకట్టుకుని కాలువలోకి దూసుకువెళ్లాయి. ఈ క్రమంలో ఒకవైపు ఉన్న రక్షణ కూడా ధ్వంసమైంది. గోడ పడిపోయి అనేకేళ్లు అయినా నేటికీ రక్షణ గోడను పునరుద్ధరించలేదు. నేషనల్ హైవే కావడంతో అనేక రాష్ట్రాల నుంచి భారీ వాహనాలు లారీలు, ద్విచక్ర వాహనాలు, ఈ రోడ్డు మార్గంలో తిరుగుతూ ఉంటాయి. ఆదమరిస్తే కాలువలోకి దూసుకువెళ్లే ప్రమాదం ఉంది. ఇలాంటి ప్రాంతాల్లో కనీసం సూచిక బోర్డులు కూడా లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకోక ముందే ఇక్కడ రక్షణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## గ్యాస్ సిలిండర్ల సరఫరాలో జాప్యంపై ధర్నా



**ంజూఎఅష్ట్రబీ, పతాకం న్యూస్:** గ్యాస్ బుక్ చేసిన రెండు రోజుల్లోనే వినియోగదారులకు డెలివరీ ఇవ్వాలని, గ్యాస్ బ్లాక్ మార్కెట్ దందాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వివిధ సేవా సంస్థల నాయకులు, వికలాంగులు ధర్నా చేశారు. అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షులు షేక్ బాషావాలి, చాకలి ఐలమ్మ సేవా సమితి అధ్యక్షులు మన్నెం పాండురంగరావు మాట్లాడుతూ గ్యాస్ డెలివరీలో జరుగుతున్న ఆలస్యం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. బ్లాక్ మార్కెట్ యథేచ్ఛగా సాగుతోందని విమర్శించారు. గ్యాస్ బుక్ చేసిన 48 గంటల్లోపు వినియోగదారుడి ఇంటికి సిలిండర్ చేరాలని, అక్రమంగా జరుగుతున్న గ్యాస్ బ్లాక్ మార్కెట్‌ను కఠినంగా అరికట్టాలని, సామాన్యులకు, ముఖ్యంగా వికలాంగులకు గ్యాస్ పంపిణీలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్‌కు అందించారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓల్డ్ స్టూడెంట్స్ యూనియన్ లీడర్ జ్ఞానరత్నం, దివ్యాంగుల కమిటీ నాయకులు అంజిబాబు, శంకర్ఆచారి, సురేష్, మక్కిన కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, మను పాల్గొన్నారు.

## దేశంలో ప్రీమియం పెట్రోల్‌పై వాత... సామాన్యులకు తప్పిన భారం



**అమరావతి, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా ప్రీమియం పెట్రోల్ ధరలు పెరిగాయి. అయితే, సామాన్యులు వినియోగించే సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలను మాత్రం స్థిరంగా ఉంచడం ఊరట కలిగించే అంశం. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలైన ఇండియన్ ఆయిల్ (ఐఓసీఎల్), హిందుస్తాన్ పెట్రోలియం (హెచ్ పీసీఎల్) తమ ప్రీమియం రకం పెట్రోల్ ధరలను లీటర్‌కు సుమారు రూ.2 నుంచి రూ.2.30 వరకు పెంచాయి. ఈ కొత్త ధరలు మార్చి 20, శుక్రవారం నుంచే అమలులోకి వచ్చాయి. పెట్రోల్ బంకుల డీలర్ల సమాచారం ప్రకారం, ఐఓసీఎల్ కు చెందిన 'ఎక్స్ పీ 95', హెచ్ పీసీఎల్ కు చెందిన 'పవర్' పెట్రోల్ వంటి హై-ఆక్టేన్ ఇంధనాలపై ఈ పెంపు వర్తిస్తుంది. ఉదాహరణకు, పూణేలో ప్రీమియం పెట్రోల్ ధర లీటర్‌కు రూ.111.68 నుంచి రూ.113.77కి చేరింది. ఈ పెంపు ప్రభావం ప్రధానంగా లగ్జరీ కార్లు, హై-పెర్ఫార్మెన్స్ బైకులు, స్పోర్ట్స్ వాహనాలు వినియోగించే వారిపైనే ఉంటుంది. సాధారణ వాహనదారులు వాడే రెగ్యులర్ పెట్రోల్, డీజిల్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల పైనే స్థిరంగా కొనసాగడం, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా సరఫరాపై ఆందోళనలు పెరగడం ఈ పెంపునకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. భారత్ తన చమురు అవసరాల్లో అధిక శాతం దిగుమతులపైనే ఆధారపడుతుంది. దీనికి తోడు రూపాయి విలువ తగ్గడంతో దిగుమతి వ్యయం కంపెనీలకు భారంగా మారింది.

# ఆక్వా ఎగుమతులకు గడ్డు పరిస్థితులు



**రాజోలు, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం ఎపిలో రొయ్య రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అమెరికా టారిఫ్ల పెంపు నుంచి ఉపశమనం లభించిందనుకున్న సమయంలో ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధంతో మరోసారి ఎగుమతులకు గడ్డు పరిస్థితులు వచ్చాయి. ఇప్పటికే రాష్ట్రం నుంచి సముద్ర మార్గంలో గల్ఫ్ దేశాలకు వెళ్లిన కంటైనర్లు వెనక్కి రావడంతో ఎగుమతిదారులు నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. ఆయా దేశాల నుంచి ఆర్డర్లు రద్దవుతుండడంతో ఇప్పట్లో పుంజుకునే అవకాశం కనిపించడం లేదని సంబంధిత వర్గాలంటున్నాయి. మరోవైపు వారం రోజుల వ్యవధిలో 100 కౌంట్ రొయ్యపై టన్నుకు రూ.40 వేల వరకు ధరలు తగ్గిపోయాయి. చేతికి వచ్చిన పంట అమ్ముకోలేక, దాచుకోలేక రైతులు సతమతమవుతున్నారు.జిల్లాలో ఎక్కువగా రైతులు సాగు చేసే టైగర్ రకం రొయ్య 80శాతం గల్ఫ్ దేశాలకే వెళు తుంది. యుద్ధం ప్రభావం ఆ దేశాలపై ఉండటంతో ధరలు రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి. ఇవి మరింత పతనమయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.తగ్గిన రొయ్యల ధరలుగతేడది అమెరికా ట్రంప్ సుంకాలు, ఇప్పుడు యుద్ధం ఆక్వా రంగంపై యుద్ధం ప్రభావం తీవ్రంగా పడింది. ఇదే పరిస్థితి కొనసాగితే ధరలు ఇంకా పతనమై భారీగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వరి,కొబ్బరి తరువాత ప్రదానంగా ఆక్వా పంటపై మొగ్గుచూపుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 77,150 ఎకరాలలో రొయ్యల సాగు జరుగుతోంది. కాకినాడలో 23,200, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 48,350, తూర్పుగోదావరి 5,600 ఎకరాల్లో సాగు జరుగుతోంది. మరో 40 వేల ఎకరాల్లో అనధికారి కంగా ఆక్వా సాగవుతుంది. ఎక్కువ మంది ప్రస్తుతం టైగర్ రకం రొయ్యలు సాగు చేస్తున్నారు. ఇవి ఎక్కువగా గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతుంటాయి. యుద్ధం నేపథ్యంలో ఆ దేశాలకు ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో వాటికి కూడా ఎగుమతులు మందగించాయి. ఈ పరిణామాలతో వ్యాపారులు ధరలు తగ్గించి రైతుల నుంచి కొను గోలు చేస్తున్నారు. ఇప్పటికే తమిళనాడుకు చేరిన రొయ్యలు ఎగుమతికాక నిలిచిపోయాయి.

దీంతో స్థానికంగా తక్కువ రేటుకు రొయ్యలను అమ్ముకోవాల్సి వచ్చిందని రైతులు తెలిపారు. 30 కౌంటు రొయ్యల ధర మూడురోజుల క్రితం రూ.510 ఉండగా ఇప్పుడు రూ.470కి పడిపోయింది. 40 కౌంటు రూ.410 ఉండగా రూ.370కి దిగజా రింది. 100 కౌంట్ ధర రూ.270 నుంచి రూ.250కి పడిపోయింది. యుద్ధం కొనసాగితే ఈ ధరలు మరింత పతనమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. వేసవిలో రొయ్యలు చేతికొచ్చే సమయానికి పరిస్థితి ఎలా ఉంటుందోనని కలవరం చెందుతున్నారు. ప్రస్తుతం రెండు నెలల క్రితం సీడ్ వదిలిన రొయ్యల చెరువుల్లో వ్యాధుల కారణంగా కొంతభాగం తుడిచిపెట్టు కుపోతు న్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటుండగా యుద్ధం ప్రభావంతో ధరలు పడిపోతుండటం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. పెట్టుబడులు పెరిగే అవకాశంఆక్వా రైతులకు ఇప్పటికే పెట్టుబడి ఖర్చు భారంగా మారింది. యుద్ధం కారణంగా సీడ్, ఫీడ్, చెరువుల్లో వాడే ఇతర కెమికల్స్ ధరలు కూడా గణనీయంగా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇలా సాగుకు అవసరమైన పెట్టుబడులు పెరగనున్నాయి. తీరా రొయ్యల పంట చేతికొచ్చే సమయానికి ధరలు మరింతగా పడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది ఆక్వా సాగుపై ముందుకు కదలాలా లేక విరమించుకోవాలా అన్న సందిగ్ధంలో పడిపోయారు.

# ఏపీలో రానున్న 3 రోజులు మోస్తరు వర్షాలు.. వడగళ్ల వానతో నష్టపోయిన రైతులు



**అమరావతి, పతాకం న్యూస్:** ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రానున్న 3 రోజుల పాటు పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు తెలిపారు. కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. శని, ఆదివారం ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో పిడుగులతో వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాతావరణ శాఖ హెచ్చరికలతో అప్రమత్తమైన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, ఇతర ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అరటి, మామిడి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలకు నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న పంటలను త్వరితగతిన గుర్తించి నష్టాన్ని నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. అన్నదాతలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. పండిన పంటలను సాధ్యమైనంత త్వరగా సేకరించి భద్రపరచాలన్నారు. వడగళ్ల వాన రైతులకు కడగండ్లు మిగిల్చింది. అకాల వర్షాలతో వరి, మొక్కజొన్న సహా ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కురిసిన వానతో శ్రీ సత్యసాయి జిల్లా అమరాపురం మండలం వలస గ్రామంలో పిందె దశలో ఉన్న దానిమ్మ రాలిపోయింది. రూ.50 లక్షల వరకు నష్టపోయామని రైతులు చెబుతున్నారు. నంబుల పూలకుంట మండలంలో మొక్కజొన్న పంట దెబ్బతింది. 30 ఎకరాల పంట నేలకొరిగినట్లు రైతులు తెలిపారు. బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లో చీనీ, అరటి, బొప్పాయి, మొక్కజొన్న, దోస పంటలు దెబ్బతిన్నాయి. సీకే పల్లి మండలం గంగినేపల్లిలో 53 ఎకరాల్లో మామిడి పంట నేల రాలడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గంగినేపల్లి, బ్రాహ్మణపల్లిని సందర్శించిన అధికారులు నష్టంపై రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కడప జిల్లా పులివెందుల మండలానికి చెందిన అరటి రైతులు నష్టపోయారు. ఇప్పటికే బాగా తక్కువ ధరలు పలుకుతుండగా అకాల వర్షం మరింత నష్టాన్ని మిగిల్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి గ్రామీణంలో చేతికొచ్చిన వరి పంట పాడైంది. బంధారపల్లి, రంగంపేట, కొట్టాల, పుల్లయ్యగారిపల్లి, కూచివారిపల్లిలో మామిడి, వరి, టమోటా దెబ్బతిన్నాయి. వడగళ్ల వాన నిలువునా ముంచిందని రైతులు వాపోతున్నారు.

ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు సమీపంలో దెబ్బతిన్న పంటను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ పరిశీలించారు. బొప్పాయి, అరటి, మొక్కజొన్న, మిర్చి రైతులతో మాట్లాడి నష్టం వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. నందిగామ డివిజన్‌లోని జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో ఈదురు గాలులతో, వడగళ్ల వర్షం పడటంతో అన్నదాతలపై పిడుగు పడినట్లు అయింది. 2 నియోజకవర్గాల్లో మిర్చి, అరటి, బొప్పాయి, ఊరి పేర్లు దెబ్బతిన్నాయి. ఆరబోసిన మిర్చి వర్షానికి తడిసింది. ఈదురు గాలులు వల్ల అరటి తోటలు పూర్తిగా నేలవాలయి. దీనివల్ల రైతులు పంట పూర్తిగా కోల్పోయారు. బొప్పాయి తోటలు 50 ఎక్టార్ల సాగు చేయగా ఈదురుగాళ్లకు చెట్లు విరిగిపడ్డాయి. కాయల పూర్తిగా రాలిపోయాయి. దీనివల్ల పంట పూర్తిగా నష్టపోయింది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో 13000 ఎకరాల్లో, నందిగామ నియోజకవర్గాల్లో 10,000 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఈదురుగాళ్లకు మొక్కజొన్న పూర్తిగా నేలపై పడిపోయింది. ఎత్తిపోతల పథకాలు, మున్నేరు ఆయాకట్ట పరిధిలో సాగుచేసిన వరి పైర్లు వడగళ్ల వానకు దెబ్బతిన్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న వారి పైర్లు వడగళ్లు పడటం వల్ల, ఈదురుగాళ్లకు పూర్తిగా నేల వాలింది. ధాన్యం పూర్తిగా రాలిపోయింది దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చనుబండ పరిసరాల్లో అకాల వర్షం, ఈదురు గాలులతో సుమారు 30 ఎకరాల మొక్కజొన్న నేలకొరిగింది. కంకి దశకు చేరుకున్న మొక్కజొన్న దెబ్బతిందని రైతులు వాపోతున్నారు.

## ఆస్తులు ప్రకటించిన కేరళ సీఎం.. దంపతుల వద్ద కోటికి పైగా డిపాజిట్లు

**అమరావతి, పతాకం న్యూస్:**

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం గురువారం తన నామినేషన్ దాఖలు చేశారు. ధర్మదం నియోజకవర్గం నుంచి లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (రాణఫ్రీ) అభ్యర్థిగా బరిలో దిగుతున్న ఆయన, తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరిచారు. ఈ అఫిడవిట్ ప్రకారం విజయన్, ఆయన భార్య కమల పేరిట రూ. కోటికి పైగా డిపాజిట్లు ఉన్నాయి. కేరళలో ఏప్రిల్ 9న 140 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.విజయన్ పేరిట రూ. 43.35 లక్షలు, ఆయన భార్య కమల పేరిట రూ. 60.58 లక్షల డిపాజిట్లు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. విజయన్‌కు 78 సెంట్ల భూమి ఉండగా, ఆయన భార్యకు 17.5 సెంట్ల భూమి, 10 సవర్ల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఇద్దరికీ ఎలాంటి అప్పులు లేవని స్పష్టం చేశారు. అదే సమయంలో, తనపై మూడు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అయితే ఏ కేసులోనూ తనకు శిక్ష పడలేదని విజయన్ వెల్లడించారు.తలసేరి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సచిన్ కృష్ణకు ఆయన నామినేషన్ పత్రాలు



సమర్పించారు. సీపీఎం సీనియర్ నేతలు ఈ.పి. జయరాజన్, ఎ.ఎన్. షంసీర్, కె.కె. రాగేష్ ఆయన వెంట ఉన్నారు. పినరయి విజయన్ అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలవడం ఇది ఏడోసారి. 1970లో 25 ఏళ్ల వయసులో తొలిసారి పోటీ చేసి గెలిచారు. ప్రస్తుతం ధర్మదం నుంచి వరుసగా మూడోసారి పోటీ చేస్తున్నారు.

## తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు



**తూర్పు గోదావరి, పతాకం న్యూస్:** డ్వాక్రా యానిమేటర్లపై ఏడిద గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సిఐటియు కోశాధికారి కె.కృష్ణవేణి హెచ్చరించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న యానిమేటర్లపై తప్పుడు ప్రచారాలు చేయడం తగదన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. యానిమేటర్లలో ఎవరో ఎక్కడైనా ఒకరో ఇద్దరో తప్పు చేస్తే అది అందరికీ ఆపాదించవద్దని అన్నారు. సోషల్ మీడియాలో ఇకపై తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ సమావేశంలో పిల్లి వెంకటలక్ష్మి, చంద్రమళ్ళ శారద, సిద్ధాంతపు కాంతరత్నం, కురమాన సత్యవేణి, ఊబలంక పార్వతి, పలివెల వెంకటసత్య రమావతి, టేకుమూడి స్వర్ణలత పాల్గొన్నారు.

## ఉరుసు మహోత్సవంలో అపశృతి



**గుంటూరు, పతాకం న్యూస్:** ఉరుసు మహోత్సవంలో అపశృతి చోటుచేసుకుంది. మండల కేంద్రమైన పెదకాకానిలోని శ్రీ హజరత్ సయ్యద్ బాజీ షాహిద్ అవులియా బాబా వారి 538 వ ఉరుసు మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉరుసు ఊరేగింపులో భాగంగా మేళతాళాలతో వెనిగండ్ల గ్రామానికి చేరుకుంది. అయితే బాణాసంచాతో ఉన్న ఆటోలోకి ఊరేగింపులో భాగంగా కాలుస్తున్న తారాజువ్వ ఆటోలోని మందుగుండు సామాగ్రిపై పడటంతో ఆటోలో ఉన్న అజయ్ (12), రీను (11) అనే విద్యార్థులు ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో ఎటు తప్పించుకోలేక తీవ్రగాయాలపాలయ్యారు. బాలురిద్దరినీ 108 సహాయంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు బాలురుని ఐసీయూ లో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

## చిరువ్యాపారులు, వెల్డింగ్ కార్మికులకు గ్యాస్ సెగ



**పల్నాడు, పతాకం న్యూస్:** అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ వాతావరణం స్థానిక చిరు వ్యాపారుల పొయ్యి ఆర్పేస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ ప్రభావంతో గత పది రోజులుగా గ్యాస్ సిలిండర్ల సరఫరాపై తీవ్ర ఆంక్షలు అమలు కావడంతో పట్టణంలోని చిరు వ్యాపారులు, గ్యాస్ వెల్డింగ్ కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. గ్యాస్ కొరత కారణంగా టీ కొట్లు, టిఫిన్ సెంటర్లు, సోడా బంక్ నిర్వాహకులు తమ వ్యాపారాలను కేవలం ఉదయం, సాయంత్రం కొద్దిసేపు మాత్రమే నడుపుతూ మిగిలిన సమయాల్లో మూసివేస్తున్నారు. దీంతో షాపు నిర్వాహకులతోపాటు వాటిల్లో పనిచేసే వారు కూడా ఉపాధికి దూరమవుతున్నారు. వాణిజ్య సిలిండర్ల ధర ఈ నెల 7వ తేదీన రూ.115 పెరిగి రూ.2056కు చేరడం, మరోపక్క సరఫరా తగ్గడంతో పట్టణంలో సుమారు 4 వేల మంది వ్యాపారులు, వారిపై ఆధారపడిన మరో 3 వేల మంది కూలీలు, అంటే మొత్తం 7 నుండి 8 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జనవరి నుండి జూన్ వరకు వ్యవసాయ పనిముట్ల తయారీకి కీలకమైన సీజన్ కావడంతో, వెల్డింగ్ పనులకు గ్యాస్ దొరక్కపోవడం శాపంగా మారింది. గ్యాస్‌తో పాటు వెల్డింగ్‌కు వాడే కార్బైట్ ధర రూ.70 నుండి రూ.100కు, వెల్డింగ్ రాడ్ల ధర రూ. 60 నుండి రూ. 100కు పెరగడం, పెరిగిన ధరల ప్రకారం కూలి రేట్లు పెంచితే కస్టమర్లు రాకపోవడంతో వెల్డింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరోనా సమయంలో కూడా ఎదుర్కోని కష్టాలను ఇప్పుడు అనుభవి స్తున్నామని, అద్దెలు కట్టలేక కుటుంబాలు గడవడం కష్టమవుతోందని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి గ్యాస్ సరఫరాను పునరుద్ధరించాలని, గ్యాస్ డెలివరీ సమయంలో జరిగే అదనపు వసూళ్లను అరికట్టి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో వ్యవసాయ గొర్రులు ఇతర పనిముట్ల తయారీ మొదలై జూన్ వరకు ఉంటుంది. ఆ తర్వాత వ్యవసాయ పనులు ప్రారంభమై వెల్డింగ్ పనులు తగ్గుతాయి. ఈ పనులకు తప్పనిసరిగా అవసరమైన గ్యాస్ దొరక్క పనులు చేయలేకపోతున్నామని, రోడ్లపక్క చిన్నచిన్న గ్యాస్, ఆక్సిజన్‌తో కటింగ్ పనులు చేస్తుంటాం. ఇప్పుడు గ్యాస్ దొరక్కపోవడం ఒకటైతే ఇతర ప్రత్యామ్నాయ వస్తువుల ధరలు పెరిగాయి. కార్బైట్ రు.70 నుంచి రూ.100కు, వెల్డింగ్ రాడ్లు 60 నుంచి రూ.100కు పెరిగాయి. షాపులకు ప్రతినెలా వేలల్లో అద్దె కట్టాల్సి రావటంతో గడ్డురోజులు ఎదుర్కొంటున్నాం. పోనీ మేమూ రేట్లు పెంచితే పనులు ఉండవు అని కార్మికులు వాపోతున్నారు.

## రోడ్డు దాటుతుండగా ఢీకొన్న వాహనం.. ఇద్దరు విద్యార్థులకు గాయాలు



**చిత్తూరు, పతాకం న్యూస్:** బైరెడ్డిపల్లి మండలంలోని పలమనేర్-బైరెడ్డిపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. మోడల్ స్కూల్ గేటు సమీపంలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బొలెరో వాహనం విద్యార్థులను ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక వివరాల మేరకు .... కమనపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న వనజశ్రీ (7వ తరగతి), హర్షరెడ్డి (9వ తరగతి) మధ్యాహ్నం పాఠాలు పూర్తయ్యాక ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, అదుపుతప్పిన బొలెరా వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది పైలట్ గౌస్, ఈఎంటి పల్లవి వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన విద్యార్థులను పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదానికి వాహన డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆరోపించారు. అదేవిధంగా, పాఠశాల వద్ద సరైన పర్యవేక్షణ లేకపోవడం కూడా ప్రమాదాలకు దారితీస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## గ్రంథాలయానికి రూ.15 వేలతో పుస్తకాలు

**మాచర్ల, పతాకం న్యూస్:** పట్టణానికి చెందిన నవోదయ సైకిల్ షోరూం యజమాని కటకం శేషగిరిరావు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అమూల్యమైనవని ప్రముఖ వైద్యులు డాక్టర్ కొండవీటి రామకోటయ్య అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు, నిరుపేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా రూ.15 వేల విలువైన పుస్తకాలను మాచర్ల పట్టణ గ్రంథాలయానికి శేషగిరిరావు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రామకోటయ్య మాట్లాడుతూ శేషు తన తండ్రి విశ్వనాథం జ్ఞాపకార్థం ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వీల్‌చైర్లు, కుర్చీలు, బెంచీలు అందించడం, గ్రంథాలయాలకు పుస్తకాలు అందించడం, మజ్జిక కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి అవసరమైన ప్లేట్లు, గ్లాసులు అందించడం వంటి అనేక ప్రజాహిత కార్యక్రమాలు శేషు నిర్వహిస్తున్నారని తెలిపారు.

# ఉదయాన్నే కీళ్లు పట్టేసినట్లు అనిపిస్తుందా? 'యూరిక్ యాసిడ్' సమస్య కావొచ్చు!

శరీరం సహజంగా విసర్జించే వ్యర్థ పదార్థాల్లో యూరిక్ యాసిడ్ ఒకటి. మనం తినే ఆహారంలో ప్యూరిన్ ఎక్కువ అవ్వడం వల్ల యూరిక్ యాసిడ్ ఏర్పడుతుందట. అయితే, విసర్జన సరిగా జరగకపోతే యూరిక్ ఆమ్లాలు రక్తంలో కలసిపోతాయని నిపుణులు చెబుతున్నారు. క్రమంగా స్ఫటికాలుగా మారి కీళ్లు, కీళ్ల చుట్టూ ఉండే కణజాలాల్లో పేరుకుపోతాయని అంటున్నారు. దీన్నే గౌట్/హైపర్ యూరిసెమియా అని కూడా పిలుస్తారు. ఈ క్రమంలో శరీరంలో యూరిక్ యాసిడ్ పేరుకుపోతే ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం! ప్రతి ఐదుగురిలో ఒకరికి యూరిక్ యాసిడ్ సమస్య ఉంటుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ప్రారంభంలో యూరిక్ యాసిడ్ స్థాయిల సంకేతాలు గమనించదగ్గవిగా ఉండకపోవచ్చు. కానీ, కాలక్రమేణా లక్షణాలు కనిపిస్తాయంటున్నారు నిపుణులు. రక్తంలో యూరిక్ యాసిడ్ పేరుకుపోవడం వల్ల శరీరంలో తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయని చెబుతున్నారు. అధిక యూరిక్ యాసిడ్ స్థాయిలు ఉన్న వారిలో ఉదయం నిద్రలేవగానే కీళ్లు పట్టేసినట్లు అనిపిస్తుంది. అయితే, కొంచెం నడక మొదటపెట్టిన తర్వాత ఈ సమస్య తగ్గిపోవచ్చట. ఈ క్రమంలో విశ్రాంతి తీసుకున్న సమయంలో యూరిక్ యాసిడ్ స్ఫటికాలు కీళ్లలో పేరుకుపోవడం వల్ల ఉదయాన్నే ఈ అసాధారణమైన బిగుతుగా ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో యూరిక్ యాసిడ్ సమస్యకు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే, కాలక్రమేణా ఇది కీళ్ల కదలికల సామర్థ్యాన్ని తగ్గిస్తుందట.



మూత్రపిండాలు ఒత్తిడికి లోనైనప్పుడు, మూత్రం రంగులో లేదా మూత్ర విసర్జన చేసే విధానంలో మార్పులను గమనించవచ్చు. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు అధికంగా ఉన్నవారు మూత్రవిసర్జన సమయంలో తీవ్రమైన దుర్వాసన లేదా మంటగా అనిపించవచ్చని అంటున్నారు. అంతేకాకుండా, మూత్రం ముదురు రంగులో లేదా నురుగు ఉండచ్చట. ఈ అధిక యూరిక్ స్థాయిలను శరీరం నుంచి బయటకు పంపడానికి, తగినంత నీరు తీసుకోవాలంటున్నారు. ఎటువంటి శారీరక శ్రమ చేయకపోయినా వివరించలేని అలసటగా ఉంటుంది. ఇందుకు అధిక యూరిక్ యాసిడ్ స్థాయిల వల్ల కావచ్చట. శరీరంలో నిరంతరం జరిగే వాపు వల్ల శక్తి ఖర్చయిపోవడం వల్ల అలసటగా లేదా నీరసంగా ఉంటుందట. నడుము కింది భాగంలో లేదా పక్కటెముకల కింద అసౌకర్యం లేదా స్వల్పంగా నొప్పి రావడం అనేది కిడ్నీ సమస్యలకు ఒక ప్రధాన సంకేతం. ఈ క్రమంలో శరీరంలో యూరిక్ యాసిడ్ పరిమాణం ఎక్కువగా ఉన్నప్పుడు, అది కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో మీరు సాధారణం కంటే ఎక్కువసార్లు మూత్ర విసర్జన చేయాల్సి రావచ్చట. ఒకవేళ దీన్ని నిర్లక్ష్యం చేస్తే, ఈ సాధారణ లక్షణాలు కాస్తా దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి వంటి తీవ్రమైన సమస్యలకు దారితీయవచ్చు. ఇది చివరకు కిడ్నీ వైఫల్యానికి కారణం కావచ్చట. యూరిక్ యాసిడ్ పదునైన స్ఫటికాలుగా కలిసిపోతుందని, ఈ స్ఫటికాలు కీళ్లలో స్థిరపడి గౌట్ అనే బాధాకరమైన అర్థరైటిస్‌కు కారణమవుతుందని అధ్యాయనంలో తేలింది.

అధిక యూరిక్ యాసిడ్ స్థాయిలు ఉన్నవారు కీళ్ల వద్ద వాపు, ఎరుపును గమనించవచ్చు. ఇది హైపర్యూరిసెమియా మరొక ప్రారంభ సంకేతమంటున్నారు నిపుణులు. యూరిక్ యాసిడ్ స్ఫటికాలు కీళ్లలో మంటను కలిగించడం వల్ల ఇలా జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రభావితమైన చోట చర్మం పైపొర మెరుస్తున్నట్లు కనిపిస్తుంది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఈ లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. ప్రభావిత కీలు లేదా కీళ్ళు వాపు, మృదువుగా, వెచ్చగా, ఎరుపుగా మారుతాయని ఒక అధ్యాయనంలో తేలింది. గౌట్ సమస్య ఉన్నవారిలో, శరీరంలో యూరిక్ యాసిడ్ అధికంగా ఉండటం వల్ల అకస్మాత్తుగా నొప్పులు తీవ్రం కావచ్చు. కీళ్లను కలిపే కణజాలాలలో యూరిక్? యాసిడ్ పేరుకుపోయి వాపును కలిగించడం వల్ల, కీళ్లలో ఈ తీవ్రమైన నొప్పి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. తరుచుగా ఈ లక్షణాలతో పాటు జర్వం లేదా చలిగా కూడా ఉండవచ్చట.

మూత్రపిండాలు ఒత్తిడికి లోనైనప్పుడు, శరీరంలో అధిక యూరిక్ యాసిడ్ ఉందని చెప్పడానికి కీళ్ల నొప్పి అనేది అత్యంత ప్రాథమిక సంకేతాలలో ఒకటి. గౌట్ అని పిలవబడే సమస్య వల్ల కీళ్లలో వాపు లేదా మంట ఏర్పడినప్పుడు ఈ లక్షణం కనిపిస్తుందంటున్నారు నిపుణులు. సాధారణంగా ఈ నొప్పి రాత్రిపూట ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో కీళ్లు మంటతో కాలిపోతున్నట్లుగా అనిపించవచ్చు. గౌట్ వ్యాధిలో కొన్ని కీళ్ళు వాపుకు గురై, ఉబ్బి, నొప్పిగా ఉంటాయని డాక్టర్లు చెబుతున్నారు.

# ఆలయ కమిటీల నియామకమెప్పుడో?

## అభివృద్ధికి నోచుకోని చారిత్రక దేవాలయాలు.. పట్టించుకోని దేవదాయశాఖ



**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలోని పలు ప్రధాన దేవాలయాలకు కమిటీలు లేవు. గత 12 ఏళ్లుగా కమిటీల నియామకాలు జరగకపోవడంతో ఆలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. చాలా ఆలయాలు దాతల సహాయ, సహకారంతో నడుస్తోన్నాయి. 2012 కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చారిత్రక ఆలయాలకు సంబంధించి అభివృద్ధి కమిటీ చైర్మన్లు, సభ్యుల నియామకం జరిగింది. ఆ తరువాత ఆ నియామకాలు ఆగిపోయాయి. సుమారు రెండేళ్లపాటు దేవదాయశాఖ అధికారులు ఆలయాల అభివృద్ధిని ఏదోలా నెట్టుకొచ్చారు. 2015 తరువాత దేవదాయశాఖ గానీ, తరువాత వచ్చిన ప్రభుత్వాలు గానీ ఆలయ అభివృద్ధి కమిటీలను నియమించలేదు. జిల్లా కేంద్రం పార్వతీపురంలో ఎన్నో చారిత్రక ఆలయాలు ఉన్నాయి. సుమారు 300 ఏళ్ల కిందట బ్రిటిష్ వారి పాలనలో సీతారామస్వామి, జగన్నాథస్వామి ఆలయాలను నిర్మించారు. ఈ ఆలయాలకు ప్రస్తుతం అభివృద్ధి కమిటీలు లేకపోవడంతో పూజలు, రథయాత్రలు దాతల సహాయంతో జరుగుతున్నాయి. బాటసారుల కోసం నిర్మించిన గాంధీసత్రం నిర్వహణ సైతం సక్రమంగా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. గాంధీసత్రానికి 12 ఏళ్ల కిందట చైర్మన్, సభ్యులు ఉండేవారు. వారి పదవీ కాలం ముగియడంతో కాలక్రమేణా గాంధీ సత్రం నిర్వహణ అధ్వానంగా మారింది. దేవదాయ శాఖాధికారులు కూడా పట్టించుకోవడం లేదు. అదే విధంగా వందేళ్ల కిందట నిర్మించిన రమాసత్యనారాయణస్వామి, కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాలకు కూడా అభివృద్ధి కమిటీలు లేవు. వీటినిర్వహణపై కూడా దేవదాయశాఖ నిర్లక్ష్యం చూపిస్తుండడం పలు విమర్శలకు తావిస్తుంది. దాతల సహాయంతో నిర్మించిన రమాసత్యనారాయణ ఆలయ అభివృద్ధి మాట అటుంచితే, నిర్వహణ అనేది రోజురోజుకూ దిగజారుతోంది. ఫలితంగా ఆలయం శిథిలావస్థకు చేరుకుంటుంది. బెలగాంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దాతల సహకారంతో మూడేళ్ల కిందట పునఃనిర్మించారు. ఆలయాలకు అభివృద్ధి కమిటీలను నియమిస్తామని గత వైసీపీ ప్రభుత్వం చెప్పింది. పార్వతీపురంలోని సీతారామ, జగన్నాథ, రమాసత్యనారాయణ, కల్యాణవెంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు, గాంధీ సత్రానికి కూడా చైర్మన్‌లను, సభ్యులను నియమిస్తామని అప్పటి ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రకటించారు. కానీ, ఐదేళ్ల పాలనలో ఎలాంటి నియామకాలు జరగలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్నా అదే పరిస్థితి. ఇప్పటికైనా ఆలయ కమిటీ చైర్మన్‌లు, సభ్యుల నియామకం చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

# ఇరాన్ రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేశాం: నెతన్యాహు



**ఇజ్రాయెల్:** ఇరాన్‌పై ఇజ్రాయెల్- అమెరికా సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్ రైజింగ్ లయన్ 20 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నెతన్యాహు కీలక కామెంట్స్ చేశారు. జెరూసలేంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరాన్ పాలకుల అణ్వాయుధ కలలను, క్షిపణి సామర్థ్యాన్ని నాశనం చేసే లక్ష్యంతో ఇజ్రాయెల్ చేపట్టిన 'ఆపరేషన్ రైజింగ్ లయన్' అద్భుతమైన ఫలితాలను ఇస్తోందన్నారు. తమ దళాలు విజయం సాధిస్తున్నాయని, ఇరాన్ సైనిక యంత్రాంగం ప్రస్తుతం అతలాకుతలమైందని, ఆ దేశ రక్షణ వ్యవస్థలు పూర్తిగా కుప్పకూలాయన్నారు. ఇరాన్ దశాబ్దాలుగా నిర్మించుకున్న క్షిపణి, డ్రోన్ వ్యవస్థలను ఇజ్రాయెల్ రక్షణ దళాలు ధ్వంసం చేసినట్లు చెప్పారు. కేవలం ఆయుధాలను ధ్వంసం చేయడమే కాకుండా, వాటిని తయారు చేసే పారిశ్రామిక పునాదులను కూడా ఇజ్రాయెల్ లక్ష్యం చేసుకుందని ఆయన వెల్లడించారు. వందలాది క్షిపణి లాంచర్లు ఇప్పటికే ధ్వంసమయ్యాయని, ఇరాన్ గర్వపడే బాలిస్టిక్ క్షిపణి నిల్వలు అగ్నికి ఆహుతయ్యాయని నెతన్యాహు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇరాన్ అణు మౌలిక సదుపాయాలపై కూడా దాడులు జరిగాయని, తద్వారా ఆ దేశం అణ్వాయుధ దేశంగా ఎదగకుండా అడ్డుకోగలిగామని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌కు చెందిన అత్యంత కీలకమైన అసలుయే గ్యాస్ కాంప్లెక్స్‌పై జరిగిన దాడి గురించి వస్తున్న వార్తలపై నెతన్యాహు స్పష్టతనిచ్చారు. ఈ దాడిని ఇజ్రాయెల్ ఎవరి సహాయం లేకుండా స్వతంత్రంగా నిర్వహించిందని ఆయన ధృవీకరించారు. అయితే, భవిష్యత్తులో మరిన్ని భారీ దాడులు చేసే విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థన మేరకు ప్రస్తుతం కొంత విరామం ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. అమెరికాతో సంబంధాలపై నెతన్యాహు మాట్లాడారు. 'ట్రంప్ నాయకత్వంలో అమెరికా, ఇజ్రాయెల్ మధ్య సమన్వయం అమోఘం. ప్రపంచంలోనే అత్యుత్తమమైన రెండు వైమానిక దళాలు, అత్యుత్తమ నిఘా సంస్థలు కలిసి పనిచేస్తే అద్భుతాలు జరుగుతాయి' అని నెతన్యాహు చెప్పుకొచ్చారు. ఇజ్రాయెల్ అమెరికాను యుద్ధంలోకి లాగుతోందన్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. ట్రంప్ ఎప్పుడూ అమెరికా ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తారని, ఆయనను ఎవరూ ప్రభావితం చేయలేరని వ్యాఖ్యానించారు. ఇరాన్ సైనిక శక్తి ప్రస్తుతం నామమాత్రంగా మిగిలిందని నెతన్యాహు వివరించారు. ఇరాన్ ఆకాశాన్ని రక్షించే వైమానిక రక్షణ వ్యవస్థలు ఇప్పుడు నిరుపయోగంగా మారాయశ్రీతీ ంఖుతీబీ




# చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ జట్లకు గట్టి ఎదురుదెబ్బ.. కీలక పేసర్లు టోర్నీ నుంచి ఔట్



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ఇంకా వారం రోజుల సమయం మాత్రమే ఉంది. అయితే, ఈ సీజన్ ప్రారంభానికి ముందు పలువురు ఆటగాళ్లు గాయాల బారినపడటంతో పలు ఫ్రాంచైజీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆస్ట్రేలియాకు చెందిన ముగ్గురు స్టార్ ఫాస్ట్ బౌలర్లు మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్ టోర్నీ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నారు. రాబోయే అంతర్జాతీయ షెడ్యూల్ చాలా బిజీగా ఉండటంతో తమ కీలక ఆటగాళ్లపై పని భారం (వర్క్‌లోడ్) తగ్గించేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఈ నిర్ణయం తీసుకుంది. ఈ అప్రోచ్ కారణంగానే ఈ పేసర్లు ఐపీఎల్ ప్రారంభానికి దూరమవుతున్నారు. ఈ పరిణామం ఢిల్లీ క్యాపిటల్స్ (స్టార్క్), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (హేజిల్‌వుడ్), సన్‌రైజర్స్ హైదరాబాద్ (కమిన్స్) జట్ల బౌలింగ్ లైనప్‌లపై తీవ్ర ప్రభావం చూపనుంది. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్టుకు ఇది డబుల్ షాక్‌గా మారింది. కెప్టెన్ పాట్ కమిన్స్ దూరం కావడమే కాకుండా, ఆ జట్టులోని మరో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ పాదం గాయం కారణంగా మొత్తం సీజన్‌కే దూరమయ్యాడు. గత వేలంలో రూ. 3 కోట్లకు అమ్ముడైన ఏకైక అన్‌క్యాప్డ్ విదేశీ ఆటగాడిగా ఎడ్వర్డ్స్ ఈ సీజన్‌లో ఐపీఎల్ అరంగేట్రం చేయాల్సి ఉండగా, గాయంతో ఆ అవకాశం కోల్పోయాడు. కమిన్స్ గైర్హాజరీలో భారత వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. గత 12 నెలల్లో టెస్టుల్లో అత్యధిక బంతులు వేసిన పేసర్‌గా నిలిచిన స్టార్క్‌కు సీఏ విశ్రాంతినిచ్చింది. ఇక, వెన్నునొప్పి గాయం కారణంగా 2025 డిసెంబర్ నుంచి కమిన్స్ ఆటకు దూరంగా ఉంటున్నాడు. హేజిల్‌వుడ్ సైతం తొడ కండరాలు, అకిలెస్ సమస్యలతో యాషెస్ సిరీస్‌కు పూర్తిగా దూరమయ్యాడు. రాబోయే వారాల్లో ఈ ముగ్గురు పేసర్ల ఫిట్‌నెస్ పురోగతిని బట్టి వారి లభ్యతపై స్పష్టత వస్తుందని తెలుస్తోంది.

# రూ.16,000 కోట్ల భారీ ఆఫర్‌కు.. నో చెప్పిన రాజస్థాన్ రాయల్స్!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌కు ముందు ఫ్రాంచైజీల విలువకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీని కొనుగోలు చేసేందుకు వచ్చిన 1.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ.16,000 కోట్లు) భారీ ఆఫర్‌ను యాజమాన్యం తిరస్కరించింది. అమెరికా, కెనడాలలో కార్యకలాపాలు సాగించే ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ కొలంబియా పసిఫిక్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ (సీపీసీపీ) ఈ బిడ్‌ను దాఖలు చేసింది. రెండు వారాల్లోనే పూర్తి మొత్తాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చినా, రాజస్థాన్ రాయల్స్ బోర్డు ఈ ప్రతిపాదనను అంగీకరించలేదు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం కేవలం అధిక విలువను ఆశించడమే కాకుండా ఒప్పందం అమలు తీరు (ఎగ్జిక్యూటబిలిటీ)పై ఉన్న సందేహాల వల్లే బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సీపీసీపీ కన్సార్టియం తరపున వ్యవస్థాపక భాగస్వాములైన నిషా సచ్‌దేవా, దేబ్‌జీత్ గుప్తా ఈ డీల్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం మాత్రం కేవలం డబ్బును మాత్రమే కాకుండా ఒప్పందం యొక్క నిర్మాణం, నిశ్చయత్వం, దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఈ ఆఫర్‌ను తిరస్కరించింది. ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్‌లో మనోజ్ బదాలేకు చెందిన ఎమర్జింగ్ మీడియా వెంచర్స్‌కు 65 శాతం వాటా ఉండగా, రెడ్‌బర్డ్ క్యాపిటల్ వంటి సంస్థలకు మైనారిటీ వాటాలు ఉన్నాయి. ఇంత భారీ ఆఫర్‌ను తిరస్కరించడం ద్వారా తమ ఫ్రాంచైజీ విలువ ఇంకా ఎక్కువేనని యాజమాన్యం మార్కెట్‌కు స్పష్టమైన సంకేతాలు పంపింది. ప్రస్తుతం అమ్మకందారులదే పైచేయిగా ఉన్న మార్కెట్‌లో తమకు అత్యధిక ప్రయోజనం కలిగే వరకు వేచి చూడాలన్నది వారి వ్యూహంగా కనిపిస్తోంది. ఈ నిర్ణయం ప్రభావం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అమ్మకం ప్రక్రియపై పడటం ఖాయంగా కనిపిస్తోంది. రాజస్థాన్ నిర్ణయంతో ఐపీఎల్ ఫ్రాంచైజీల వాల్యుయేషన్ అంచనాలు మారిపోయాయి. ఆర్‌సీబీకి ఉన్న బలమైన బ్రాండ్ ఇమేజ్, భారీ అభిమాన గణం, వాణిజ్యపరమైన ఆకర్షణ కారణంగా రాజస్థాన్ రాయల్స్ కంటే కనీసం 15 శాతం అధిక విలువ పలికే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మణిపాల్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రంజన్ పాయ్, అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ కేకేఆర్, సింగపూర్‌కు చెందిన టెమాసెక్ నేతృత్వంలోని కన్సార్టియం ఆర్‌సీబీలో వాటా కొనుగోలు రేసులో ముందున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ఐపీఎల్ ఫ్రాంచైజీలు కేవలం క్రికెట్ జట్లుగా కాకుండా ప్రపంచస్థాయి క్రీడా ఆస్తులుగా మారిపోయాయి.




## స్టైలిష్ క్లైమాక్స్.. సిద్ధం చేసిన
# 'మన శంకరవరప్రసాద్ గారు'



నటి సంయుక్త మీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'ది బ్లాక్ గోల్డ్' షూటింగ్ శరవేగంగా తుది దశకు చేరుకుంది. యోగేశ్ కేఎంసీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను ఈ ఏడాది జూన్ లేదా జూలైలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్మాత రాజేశ్ దండా వెల్లడించారు. ఇటీవల ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆయన సినిమా విశేషాలు పంచుకున్నారు. "గన్ పట్టుకున్న పోలీస్ ఆఫీసర్‌కు, గన్ మాత్రమే వాడే విలన్‌కు మధ్య జరిగే కథ ఇది. ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో చిత్రీకరిస్తున్నాం. సంయుక్త కెరీర్‌లో ఇది చాలా కొత్త తరహా పాత్ర అవుతుంది" అని ఆయన వివరించారు. సినిమాకు సంబంధించి ఇంకా ఐదు రోజుల టాకీ పార్ట్ మాత్రమే మిగిలి ఉందని, పోస్ట్-ప్రొడక్షన్ పనులు కూడా సమాంతరంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ చిత్రంలో సంయుక్త మీనన్ ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా ఓ పవర్‌ఫుల్, ఫియర్స్ కాప్ అవతార్‌లో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదల చేసిన ఆమె పోస్టర్‌కు మంచి స్పందన వచ్చింది. హాస్య మూవీస్, మగంటి పిక్చర్స్ పతాకాలపై ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇందులో మురళీ శర్మ, రావు రమేశ్, నాజర్, మనీష్ వాధ్వా, రాంకీ వంటి భారీ తారాగణం నటిస్తోంది. రొటీన్ యాక్షన్ డ్రామాలకు భిన్నంగా, సరికొత్త కథనం, ఊహించని మలుపులతో ఈ సినిమా ఉండనుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ఏకకాలంలో విడుదల

# 'ధురంధర్ 2' కలెక్షన్ల సునామీ..



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం విడుదలైన మొదటి రోజే భారత సినీ పరిశ్రమలో ఎన్నో రికార్డులను తిరగ రాసింది. ట్రేడ్ వర్గాల అంచనాలను మించి, ఈ సినిమా ఒక్కరోజే దేశవ్యాప్తంగా సుమారు రూ.146 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించి సంచలనం సృష్టించింది. ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం ద్వారా ఎన్నో భారీ చిత్రాల రికార్డు లను ఇది అధిగమించింది. 'ధురంధర్ 2' ప్రభంజనం వేసిన ప్రీమియర్ షోలతోనే మొదలైంది. ప్రీమియర్ల ద్వారానే ఈ చిత్రం ఇండియాలో దాదాపు రూ.43 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. భారతీయ సినిమాలో ప్రీమియర్ల ద్వారా అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఇది సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇక మొదటి రోజు వసూళ్లలో హిందీ వెర్షన్ నుంచే రూ.103 కోట్లకు పైగా రాబట్టింది. తద్వారా ఫస్ట్ డేనే రూ.100 కోట్ల మార్క్ దాటిన తొలి హిందీ సినిమాగా బాలీవుడ్ చరిత్రలో నిలిచిపోయింది. ఇప్పటివరకు బిగ్గెస్ట్ ఓపెనర్లుగా ఉన్న 'జవాన్', 'పఠాన్', 'యానిమల్' వంటి చిత్రాల రికార్డులను 'ధురంధర్ 2' బద్దలు కొట్టింది. కేవలం హిందీలోనే కాకుండా ఆల్ ఇండియా స్థాయిలో కూడా ఈ చిత్రం తన సత్తా చాటింది. మొదటి రోజు వసూళ్లలో 'బాహుబలి 2', 'ఆర్ఆర్ఆర్' వంటి పాన్-ఇండియా బ్లాక్‌బస్టర్ల రికార్డులను కూడా 'ధురంధర్ 2' అధిగమించడం విశేషం. అన్ని భాషల్లో కలిపి చూసుకుంటే దేశంలో 'పుష్ప 2' తర్వాత రెండో అతిపెద్ద ఓపెనింగ్ సాధించిన చిత్రంగా నిలిచింది. దక్షిణాదిలో కూడా ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తోంది. తెలుగు డబ్బింగ్ వెర్షన్ తొలిరోజే రూ.2 కోట్లకు పైగా వసూళ్లు సాధించగా, తమిళంలోనూ మంచి ఆదరణ దక్కించుకుంటోంది. డైరెక్టర్ ఆదిత్య ధర్ టేకింగ్, రణ్‌వీర్ సింగ్ ఎనర్జిటిక్ పర్ఫార్మెన్స్, ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. సినిమాలో కీలక పాత్రలు పోషించిన ఆర్. మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి స్టార్ల నటన సినిమా స్థాయిని మరింత పెంచింది. మొదటి భాగం విజయం సాధించిన నేపథ్యంలో 'ధురంధర్ 2' కూడా అదే జోరుతో బాక్సాఫీస్ వద్ద మరిన్ని కొత్త బెంచ్‌మార్కులు సెట్ చేస్తుందని ట్రేడ్ అనలిస్టులు అంచనా వేస్తున్నారు.






# 'ఉస్తాద్ భగత్ సింగ్' మొదటి రోజు ఎంత వసూలు చేసిందంటే?



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 19న విడుదలైంది. ఉగాది సందర్భంగా రిలీజ్ అయిన ఈ సినిమాకు హరీశ్? శంకర్? దర్శకత్వం వహించారు. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, ఆ చిత్రం తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద సుమారు రూ. 50 కోట్ల నెట్ వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది.

నల్లమల ప్రాంతానికి సమీపంలోని ఓ గ్రామంలో చంద్రశేఖర్ రావు టీచర్‌గా పనిచేస్తున్నాడు. తను ఎప్పుడూ ఆ గ్రామ ప్రజల అభివృద్ధి కోసమే పాటు పడుతుంటాడు. అలాగే అక్కడి ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేస్తాడు. అంతేకాకుండా అనాథగా ఉన్న చిన్నయ్యను దత్తత తీసుకుని చదివిస్తాడు. ఆ బాలుడి ప్రవర్తన, మనస్తత్వాన్ని చూసి అతనికి 'భగత్ సింగ్' అని పేరు పెడతాడు.

తన తండ్రి ఉస్తాద్ అని పలిచేవాడని 'ఉస్తాద్ భగత్ సింగ్'గా మారతాడు. అనంతరం ఆ మాస్టార్ సేవా గుణం నచ్చి ప్రజలంతా ఆయన్ని ముఖ్యమంత్రిని చేస్తారు. ఉస్తాద్ కూడా పెద్దయ్యాక ఏసీపీ అవుతాడు. ఆ తర్వాత తనని పెంచిన చంద్రశేఖర్‌కు ఎలాంటి ఆపద రాకుండా రక్షణగా నిలుస్తాడు. అయితే తప్పుడు వ్యక్తులతో పరిచయం ఉన్న చెదలమర్రి నల్లనాగప్ప అనే ప్రభావశీల వ్యక్తి ముఖ్యమంత్రి కావాలనుకున్నాడు. దాని కోసం చంద్రశేఖర్‌ను చంపాలని ప్రయత్నిస్తాడు. మరి నల్లనాగప్పను ఉస్తాద్ భగత్‌సింగ్ ఎలా ఎదుర్కొంటాడు? ఉస్తాద్‌ను ఓడించడానికి నల్లనాగప్ప ఎలాంటి ఎత్తులు వేస్తాడు? ఈ క్రమంలో భగత్ సింగ్‌కు పరిచయమైన లీలా, శ్లోకలు ఎవరు? అనే విషయాలు సినిమాలో తెసుకుంటాం. పవన్ కల్యాణ్ ఈ సినిమాలో తన మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా అదరగొట్టారు. సాధారణ సన్నివేశాలకూ తన స్టైల్‌తో ప్రత్యేకత తీసుకొచ్చారు. రాశీఖన్నా పాత్ర మొదటి భాగంలో పరిమితంగానే ఉంటుంది. శ్రీలీలకు మాత్రం మంచి ప్రాధాన్యం ఉన్న పాత్ర దక్కింది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**